తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 74 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 ఆదివారం 18 - 10 - 2026 వెల రూ. 2 రూ/

కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి
- ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన
- విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి
- రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- గతంలో చలిగా ఉండే అక్టోబర్‌లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత
- వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి



హైదరాబాద్ :

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు.గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, - మిగతా 2 లో

హైదరాబాద్‌లోనూ ఈడీ మెరుపుదాడులు



- ఆన్‌లైన్ గేమింగ్ ముఠా గుట్టురట్టు
- హైదరాబాద్ సహా ఐదు నగరాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలపై ఈడీ దాడులు
- అక్టోబర్ 13న 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన అధికారులు
- దుబాయ్ కేంద్రంగా బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు సాగుతున్నట్లు గుర్తింపు
- షెల్ కంపెనీలు, క్రిప్టో కరెన్సీ ద్వారా నిధులను విదేశాలకు తరలిస్తున్నట్లు వెల్లడి
- కేసుతో సంబంధం ఉన్న పలు బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసిన ఈడీ



బీజేపీకి నచ్చని ఓట్లను తొలగిస్తున్నారు

- 'సర్' ప్రక్రియపై మహేశ్ కుమార్ గౌడ్
- 'సర్' ప్రక్రియలో లోపాలున్నాయన్న టీపీసీసీ చీఫ్
- ఓటర్ల జాబితా సవరణలో నిబంధనలు పాటించడం లేదని విమర్శలు
- వ్యక్తి మరణిస్తే ఓటు తొలగించాలని, వేరే ప్రాంతానికి మారితే బదిలీ చేయాలని సూచన
- ఎన్నికల సంఘం స్వతంత్రతపై ఆందోళన

హైదరాబాద్ :

ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తీవ్ర - మిగతా 2 లో

ఎల్‌నినో తెచ్చిన ముప్పు ఫిబ్రవరిలోనే వేసవి ప్రారంభం!



- ఎల్‌నినో ప్రభావంతో శీతాకాలం కూడా అధిక ఉష్ణోగ్రతలతో ఎండాకాలంగా మారనుందని క్లైమేట్ ట్రెండ్స్ నివేదిక వెల్లడించింది
- 1901 తర్వాత అత్యంత వేడినెలగా 2026 ఆగస్టు రికార్డు సృష్టించింది
- ఎల్‌నినో ప్రభావంతో ముందుగానే వేసవి ప్రారంభం

హైదరాబాద్ :

ఎల్‌నినో ప్రభావంతో శీతాకాలం కూడా అధిక ఉష్ణోగ్రతలతో ఎండాకాలంగా మారనుందని క్లైమేట్ ట్రెండ్స్ అధ్యయన నివేదిక వెల్లడించింది. అలాగే 1901 తర్వాత అత్యంత వేడి నెలగా 2026 ఆగస్టు రికార్డు సృష్టించింది. ఎల్‌నినో ప్రభావంతో పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ఫిబ్రవరి నెలలోనే - మిగతా 2 లో

అభిజీత్ దీప్కేకు బెయిల్ మంజూరు

- పీన్ బాండ్‌పై సంతకం చేసిన తర్వాతే విడుదల!
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు కొన్ని నిబంధనలతో కూడిన బెయిల్ మంజూరు అయినట్లు దిల్లీ పోలీసులు శనివారం తెలిపారు
- పీన్ బాండ్‌పై సంతకం చేసిన తర్వాతే దీప్కే విడుదల అవుతారని స్పష్టం చేశారు



ఢిల్లీ :

కామ్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు దిల్లీ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అయితే శాంతి బాండ్ (పీన్ బాండ్)పై సంతకం చేసిన తర్వాతే దీప్కే విడుదల అవుతారని దిల్లీ పోలీసులు తెలిపారు.అభిజీత్ దీప్కే శుక్రవారం తిరంగా మార్చ్ కోసం కనాట్‌ప్లేస్‌కు బయలుదేరగా, పోలీసులు ఆయనను అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై సీజేపీ లీగల్ అఫైర్స్ హెడ్ రత్నా - మిగతా 2 లో

ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం



- చంద్రబాబు, పవన్‌తో వేర్వేరుగా భేటీ
- ఏపీలో పర్యటించిన మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్
- సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ
- మంగళగిరిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సమావేశం
- త్వరలో మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని తెలిపిన పవన్ కల్యాణ్

భారీ సాయం కోసం భారత్‌కు నేపాల్

- బాలేంద్ర షా నవంబరు 22 లేదా 23న భారత్‌కు వచ్చే అవకాశం
- పునర్నిర్మాణానికి భారీ ఆర్థిక సాయం కోరుతున్న నేపాల్
- సరిహద్దు వివాదాలు, వాణిజ్య ఒప్పందంపై చర్చలు
- మూడు కొత్త విమాన ప్రవేశ మార్గాలకు అనుమతి కోరుతున్న నేపాల్
- మూడు ప్రధాన జలవిద్యుత్ ప్రాజెక్టులపై చర్చించే అవకాశం

ఢిల్లీ :

నేపాల్ ప్రధాని బాలేంద్ర షా భారత్ పర్యటనకు సిద్ధమవుతున్నారు. నవంబరు 22 లేదా 23 తేదీన ఆయన న్యూఢిల్లీకి వచ్చే అవకాశముంది. ఈ పర్యటనలో భారత్ నుంచి భారీ ఆర్థిక సాయం పొందడమే ప్రధాన లక్ష్యంగా నేపాల్ ప్రభుత్వం అడుగులు - మిగతా 2 లో





దసరా పండుగ నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీ రద్దీ

- విజయవాడ హైవేపై కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్
- యాదాద్రి జిల్లా పంతంగి టోల్‌ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- చౌటుప్పల్‌లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా ట్రాఫిక్‌కు అడనపు అడ్డంకి
- రద్దీని తగ్గించేందుకు వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లింపు

అమరావతి :

దసరా పండుగ పురస్కరించుకుని హైదరాబాద్ నగరవాసులు భారీ సంఖ్యలో సొంతూళ్లకు - మిగతా 2 లో

ఆంధ్రప్రదేశ్‌ని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు



- టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్
- టీడీపీ, వైసీపీలది ప్రతీకార రాజకీయమన్న షర్మిల
- స్థానిక ఎన్నికల్లో హింసపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- ఎన్నికల సంఘం, పోలీసుల తీరుపై ప్రశ్నలు
- స్వేచ్ఛాయుత ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్

అమరావతి :

టీడీపీ, వైసీపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు దాష్టీక రాజకీయాలు చేస్తూ, ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నాయని ఆరోపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మరో 'సౌత్ బీహార్'గా మార్చే పరిస్థితులు - మిగతా 2 లో

ఏపీలో నామినేషన్ల వేడి

గాల్లోకి కాల్పులు జరిపిన పోలీసులు

- టీడీపీ, వైఎస్సార్సీపీ వర్గీయుల మధ్య ఘర్షణలు
- ఆరు రౌండ్లు కాల్పులు జరిపినట్లు సమాచారం
- పులివెందులలో స్థానిక ఎన్నికల నామినేషన్ల వద్ద ఉద్రిక్తత
- పలు జిల్లాల్లో రెండో రోజూ టీడీపీ, వైఎస్సార్సీపీ వర్గీయుల మధ్య ఘర్షణలు
- వివిధ ప్రాంతాల్లో ఘటనల దృష్ట్యా పోలీసులు భారీగా మోహరించారు
- ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని వెల్లడి





అమరావతి :

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా పలు జిల్లాల్లో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి. నామినేషన్ కేంద్రాల వద్ద అధికార, ప్రతిపక్షాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. 2021లో దౌర్జన్యాలతో ఏకగ్రీవాలు చేసుకున్న తరహాలోనే ఇప్పుడూ వైఎస్సార్సీపీ అనుసరిస్తున్న విధానాలు ఘర్షణలకు దారితీస్తున్నాయి. పుంగనూరు, తిరుపతి, ధర్మవరం, రాయచోటిలో నామినేషన్ల తొలిరోజు జరిగిన ఘటనలు వైఎస్సార్సీపీ దౌర్జన్యకాండకు అద్దం పడుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తొలిరోజే వైఎస్సార్సీపీ అరాచకపర్వం మొదలైంది. 2021 ఎన్నికల తరహాలోనే అలజడులు సృష్టించి నామినేషన్లు వేసేందుకు వచ్చేవారిని భయపెట్టి అడ్డుకోవాలనే పంథానే అమలు చేయాలని ఆ పార్టీ నిర్ణయించుకున్నట్లు తొలిరోజే తేలిపోయింది. నేడు రెండో రోజూ పలు జిల్లాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.రాయచోటిలో మరోసారి ఉద్రిక్తత : అన్నమయ్య జిల్లా రాయచోటిలో నేడు మరోసారి ఉద్రిక్తత నెలకొంది. మదనపల్లి రోడ్డులోని ఓ లాడ్జిలో వైఎస్సార్సీపీ కార్యకర్తలు, కర్ణాటక నుంచి వచ్చినవారు, బౌన్సర్లు మకాం వేసినట్లు సమాచారం - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

సంపాదకీయం

నిరసనల రాజధాని!



ఎన్నికల సంఘం(ఈసీ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ అటు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), ఇటు ఇండియా కూటమి పక్షాలు చేస్తున్న ఆందోళనలతో ఢిల్లీ నగరం 'నిరసనల రాజధాని' గా మారిపోయింది. జూలై 'అనుభవం'తో జంతర్‌మంతర్ వైపు ఎవరినీ రానీయరాదన్న కృతనిశ్చయం ప్రదర్శించి పోలీసులు చేసిన అతి వల్ల పలుచోట్లకు అది విస్తరించింది! ఆర్‌కే ఆశ్రమ్, ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా, నిగంబోద్ ఘాట్, కన్నాట్ ప్లేస్ లాంటి పలు ప్రాంతాల్లో ఉద్యమకారులకూ, పోలీసులకూ బాహాబాహీ తప్పలేదు.విపక్ష ఇండియా కూటమి ఆధ్వర్యాన సుప్రీంకోర్టుకు ర్యాలీ తీయటం, వినతిపత్రం ఇస్తామనటం కొత్త పరిణామం. ఢిల్లీలో విమానంలోకి చొరబడి సీజేపీ నేతల్ని అరెస్టుచేశారు. జంతర్‌మంతర్ వైపు దూసుకెళ్లే వేలాదిమంది ఉద్యమకారులపై మాత్రమే కాదు... జర్నలిస్టులపైనా పోలీసులు ప్రతాపం చూపారు. గుర్తింపుకార్డులు గుంజుకున్నారు. ఆడ, మగ తేడాలేకుండా ఈడ్చుకు పోవటం, మోరటుగా ప్రవర్తించటం రానున్నకాలంలో బీజేపీని వెంటాడే దృశ్యాలవుతాయి. ఒకటీ రెండుచోట్ల హిందూ సంస్థలకు చెందినవారిగా చెప్పుకున్న వ్యక్తులు యువతీయువకులపై పిడిగుద్దులు కురిపించటం, నిండుగా లాఠీలు నింపుకుని కారులో వచ్చినవారికి పోలీసులు రక్షణనివ్వటం దిగ్భ్రాంతి కలిగించింది.తెలివైన పాలకులు నిరసనల్ని అడ్డుకోరు. అవి వాతావరణాన్ని తెలిపే బారో మీటర్ లాంటివి. పదిమంది గుమిగూడి ఎలుగెత్తారంటే పాలన సవ్యంగా లేదని అర్థం చేసుకోవాల్సిందిపోయి, గొంతు నొక్కాలని చూస్తే ఉద్యమం నమసిపోదు సరికదా... అది మరింత బలంగా, వేగంగా విస్తరిస్తుంది. చివరకు సర్వోన్నత న్యాయ స్థానం సైతం జోక్యం చేసుకుని చీవాట్లు పెట్టిందంటే తమ ఓవరాక్షన్ ఎంతగా శ్రుతిమించిందో పోలీసులు తెలుసుకోవాలి. ఎందుకనో... ఈ ఆందోళనల హోరులోనే జంతర్ మంతర్ ఇంకెంత మాత్రం నిరసనలకు వేదిక కాదంటూ ఢిల్లీ పోలీసులు హఠాత్తుగా సోమవారం ప్రకటించారు.ఢిల్లీ అంతటా బారికేడ్లు, దాదాపు 50,000మంది పోలీసులు, ఇతర బలగాల మోహరింపు, వందల ప్రదేశాల్లో ట్రాఫిక్ మళ్లింపులు, 45 మెట్రో స్టేషన్ల మూసివేత, విద్యాసంస్థలు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాల్సి రావటం వగైరాలన్నీ దేనికోసం? కేవలం జ్ఞానేశ్‌ను కాపాడటానికేనా? ఈసీలో ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రకారం నిర్ణయాలు అమలుకావాల్సివుండగా, జ్ఞానేశ్ అభీష్టమే చెల్లుబాటు కావటం చట్టవిరుద్ధం, రాజ్యాంగవిరుద్ధం కూడా. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం గతనెల 23న దీన్ని వెల్లడించాక అదంతా అబద్ధమనీ, ఏ నిర్ణయమైనా సమష్టిగానే తీసుకున్నామనీ ముగ్గురూ కలిసి మీడియా ముఖంగా చెప్పిందిలేదు. కనీసం జ్ఞానేశ్ ఒక్కరైనా సంజాయిషీ ఇచ్చింది లేదు.20 రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాల్లో దేశ జనాభాలో 10 శాతంమంది ఓట్లు... అంటే 13 కోట్లమందికిపైగా ఓట్లు ఏకపక్షంగా తొలగిస్తే... ఆ విషయంలో ఇద్దరు కమిషనర్లూ ముందే హెచ్చరించినా ఆ వ్యవస్థ అచేతనంగా ఉండిపోవటం ఆశ్చర్యకరం. ఏపీతో సహా అనేకచోట్ల ఎన్నికల్ని అపసవ్యంగా, అడ్డదిడ్డంగా నిర్వహించిన వైనం సాక్ష్యాధారాలతో బయటపడింది. అయినా కొందరు మాజీ న్యాయమూర్తులూ, ఇంకొందరు మాజీ ఉన్నతాధికారులూ ఈసీ తీరును సమర్థిస్తూ ప్రకటనలు విడుదల చేయటం దిగ్భ్రాంతికరం. ఇలాంటివారి చేతుల్లో కొన్నాళ్లు ప్రజాస్వామిక వ్యవస్థలన్నీ నడిచాయంటే చోద్య మనిపిస్తుంది. జవాబుదారీతనం జాడలేనిచోట ప్రజాస్వామ్యం మనగలుగుతుందా?యాదృచ్ఛికమే గానీ... చిలీ, బ్రెజిల్, స్పెయిన్, ఫ్రాన్స్ దేశాల్లో సైతం గతవారం జెన్ జీ జూలువిదిల్చింది. డిమాండ్లు వేరు కావొచ్చు, నిరసన రూపాలు భిన్నం కావొచ్చు--కానీ పాలకులు తాము చెప్పేది వినాలన్నదే యువత నిరసనల సారాంశం. స్వాతంత్రోద్యమ కాలంలో ఢిల్లీలో నిరసనలకు యమునా తీరం, జమా మసీదు, ఆజాద్ పార్క్, ఫిరోజ్ షా కోట్లవంటి పలు స్థలాలుండేవి. తదుపరి పటేల్ చౌక్, సంసద్ మార్గ్‌ల్లో నిరసనలకు చోటిచ్చారు. యాభైయ్యేళ్లు దాటాక అది జంతర్‌మంతర్‌కు చేరింది. ఇప్పుడు అక్కడి నుంచి కూడా వాటిని బహిష్కరించటం అసహనానికి పరాకాష్ఠ. జరుగుతున్న పరిణా మాలు సవ్యంగా లేవు. సకాలంలో సరిచేయకుంటే నిరసనలు మరింత తీవ్రమవుతాయి.

ఏపీలో నామినేషన్ల వేడి



మొదటిపేజీ తరువాయి - అందడంతో తెలుగుదేశం కార్యకర్తలు అక్కడికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. దీంతో లాడ్జి పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైఎస్సార్సీపీ, తెలుగుదేశం వర్గాలు పరస్పరం ఘర్షణకు దిగారు. ఘర్షణల్లో అక్కడే ఉన్న ఓ కారు ధ్వంసమైంది.పోలీసులు లాడ్జి వద్దకు చేరుకొని వైఎస్సార్సీపీ శ్రేణులు సహా కర్ణాటక వ్యక్తులు, బౌన్సర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద మారణాయుధాలు ఉన్నట్లు గుర్తించారు. రాయచోటిలో నిన్న అల్లర్లు చెలరేగిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మరోసారి అల్లర్లకు తావివ్వకుండా పెద్ద ఎత్తున భద్రతా బలగాలను మోహరించారు. పెద్ద సంఖ్యలో పోలీసులు పట్టణానికి చేరుకున్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. రాయచోటిలో ర్యాలీలు, ఆందోళనలను పోలీసులు నిషేధించారు. అదనపు ఎస్పీ వెంకటాద్రి పట్టణంలో పర్యటిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.తెలుగుదేశం, వైఎస్సార్సీపీ వర్గీయుల పరస్పర దాడులతో కడప నగరం సహా జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో గందరగోళం నెలకొంది. నామినేషన్ల ప్రక్రియ రెండో రోజున కడప నగరంలోని పలు నామినేషన్ కేంద్రాల వద్ద వైఎస్సార్సీపీ, తెలుగుదేశం దాడులు చేసుకున్నాయి. ఒకరిపై మరొకరు రాళ్లు రువ్వుకున్నారు. పరిస్థితి అదుపుతప్పక ముందే పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను ఎక్కడికక్కడ చెదరగొట్టాయి.అటు రాజంపేటలోనూ టీడీపీ, వైఎస్సార్సీపీ శ్రేణులు దాడులకు దిగాయి. పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. కడప జిల్లాలో ఘర్షణల నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అంజాద్ బాషాను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులపైకి వైఎస్సార్సీపీ కార్యకర్తలు దూసుకెళ్లడంతో పోలీసులు కాల్పులు జరిపారు. గాలిలోకి ఆరు రౌండ్ల కాల్పులు జరిపారు. వైఎస్సార్సీపీ కార్యకర్తలను అదుపు చేసేందుకు పోలీసులు కాల్పులు జరిపారు.తిరుపతిలో ఈనాడు రిపోర్టర్‌పై తెలుగుదేశం కార్యకర్తలు దాడి చేశారు. తిరుపతి మున్సిపల్ కార్యాలయం సమీపంలో నామినేషన్ సమయంలో ఫోటోలు తీస్తుండగా ఈనాడు రిపోర్టర్ గంగాధర్‌శర్మపై దాడికి పాల్పడ్డారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన సమయంలో ఫోటోలు తీస్తుండగా రిపోర్టర్ ఫోన్ లాక్కొని కొట్టారు. గంగాధర్ శర్మ ఫోన్‌లోని ఫోటోలను టీడీపీ కార్యకర్తలు డిలీట్ చేసి తిరిగి ఇచ్చారు.నామినేషన్ల దృష్ట్యా అనంతపురం జిల్లా తాడిపత్రితో భారీగా పోలీసులను మోహరించారు. తాడిపత్రి మున్సిపల్ కార్యాలయం వద్ద బలగాలు తనిఖీలు చేస్తున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వజ్రవాహనం, బాష్పవాయువు గోళాలను పోలీసులు సిద్ధం చేశారు. తాడిపత్రి మున్సిపల్ కార్యాలయం చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేశారు. నామినేషన్ల దాఖలుకు టీడీపీ, వైఎస్సార్సీపీ అభ్యర్థులకు వేర్వేరుగా గదులు కేటాయించారు.మరోవైపు నామినేషన్ల తొలిరోజు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఘటనలు దృష్ట్యా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున సమస్యాత్మక ప్రాంతాల్లో వైఎస్సార్సీపీ నేతలకు నోటీసులు ఇచ్చారు. పలువురు నేతలను గృహనిర్బంధం చేశారు. కడప జిల్లాలో వైఎస్సార్సీపీ నేతలు అవినాష్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, అంజాద్‌బాషాకు నోటీసులు అందజేశారు. అల్లర్లు, గొడవలు సృష్టించవద్దని నేతలను పోలీసులు కోరారు.144 సెక్షన్ ఉన్నందున ర్యాలీలు, ధర్నాలు చేయకూడదని నోటీసుల్లో పేర్కొన్నారు. మరో వైపు పల్నాడు జిల్లాలోనూ వైఎస్సార్సీపీ నేతలను గృహనిర్బంధం చేశారు. మాచర్లలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గృహనిర్బంధం చేశారు. నోటీసులు జారీ చేసిన పోలీసులు నామినేషన్ల దృష్ట్యా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డిని నరసరావుపేటలో హౌస్ అరెస్ట్ చేశారు.

అభిజీత్ దీప్కేకు బెయిల్ మంజూరు

మొదటిపేజీ తరువాయి - సింగ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పోలీసులు దీప్కే ప్రాథమిక హక్కులను, చట్ట ప్రక్రియను ఉల్లంఘించారని ఆరోపించారు. దీప్కేను తక్షణమే విడుదల చేయాలని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టును ఆమె కోరారు. ఆ తర్వాత, శాంతియుతంగా నిరసనలో పాల్గొనాలని పౌరులను కోరడం నేరం ఎలా అవుతుంది అని రత్నా సింగ్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. "అభిజీత్ దీప్కే అరెస్టు చట్టవిరుద్ధం. కాబట్టి స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు ఆయనను విడుదల చేయాలి. ఆయన ప్రజలను కేవలం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని మాత్రమే కోరారు. అది నేరం ఎలా అవుతుంది" అని రత్నా సింగ్ ప్రశ్నించారు.అభిజీత్ దీప్కేను ఆయన నివాసం వెలుపల నుంచి తీసుకెళ్లిన తీరుపై రత్నా సింగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "అభిజీత్ దీప్కేను ఆయన నివాసం వెలుపలి నుంచి తీసుకెళ్లిన విధానం దారుణంగా ఉంది. అధికారులు కనీసం ఆయన ఎక్కడ ఉన్నారనే సమాచారాన్ని వెల్లడించలేదు. అలాగే దీప్కే తన న్యాయవాదిని కలుసుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. ఇది చట్టప్రక్రియ, ప్రాథమిక హక్కులపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోంది. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో ఇలాంటి అధికార దుర్వినియోగాన్ని ఎలా సమర్థించుకుంటారు 'ప్రివెంటివ్ డిటెన్షన్' పేరుతో దిల్లీ పోలీసులు ఇలా చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడకూడదు" అని రత్నా సింగ్ అన్నారు. అభిజీత్ దీప్కేను శనివారం మధ్యాహ్నం మందిర్‌మార్గ్ పోలీస్ స్టేషన్‌లోని ఎస్ఈఎం ముందు హాజరుపరచాల్సి ఉందని ఆమె తెలిపారు.కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో నిర్వహించాలనుకున్న 'లెహ్రో దో తిరంగా' ర్యాలీకి వెళ్తున్న దీప్కేను దిల్లీ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అంతేకాదు సెంట్రల్ దిల్లీలో బహిరంగ సభలపై కఠినమైన నిషేధాజ్ఞలు విధిస్తూ అధికారులు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎన్ఎస్)లోని సెక్షన్ 163ని ప్రయోగించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా సీజేపీ తలపెట్టిన నిరసనల నేపథ్యంలో దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాము బహిరంగ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన దాదాపు 150 మంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నామని, వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ముఖ్యంగా దీప్కేపై బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 126, సెక్షన్ 170 కింద కేసు నమోదు చేశామన్నారు.

భారీ సాయం కోసం భారత్‌కు నేపాల్

మొదటిపేజీ తరువాయి - వేస్తోంది. దీంతో పాటు సరిహద్దు వివాదాలు, వాణిజ్యం, విమాన మార్గాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులపై చర్చించాలని భావిస్తోంది.ఆగస్టు 26న నేపాల్‌లో వచ్చిన భారీ వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. దాదాపు 1,500 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 5,000 మందికి పైగా ఆచూకీ తెలియడం లేదు. రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ కేంద్రాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో పునర్నిర్మాణ పనుల కోసం భారత్ నుంచి భారీ సాయాన్ని నేపాల్ కోరుతోంది. తక్కువ షరతులతో నిధులు అందించాలని ఆశిస్తోంది.లిపులేఖ్, కాలాపానీ, లింపియధురా ప్రాంతాలపై కొనసాగుతున్న వివాదాన్ని కూడా నేపాల్ ప్రస్తావించనున్నట్లు సమాచారం. భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని ముందుగానే సమీక్షించాలని కోరుతోంది. భారత ప్రమాణాల సంస్థ (బీఐఎస్) ధ్రువీకరణ నిబంధనల వల్ల తమ దేశ ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని కోరుతోంది.ప్రస్తుతం నేపాల్‌కు వచ్చే అంతర్జాతీయ విమానాల్లో ఎక్కువ శాతం సిమరా మార్గం మీదుగానే ప్రవేశిస్తున్నాయి. దీంతో రద్దీ పెరుగుతోంది. జనక్‌పుర్, భైరహవా, నేపాల్‌గంజ్ మీదుగా కొత్త విమాన ప్రవేశ మార్గాలకు అనుమతి ఇవ్వాలని నేపాల్ కోరుతోంది. భద్రతా కారణాలతో భారత్ ఈ ప్రతిపాదనపై ఆచితూచి వ్యవహరిస్తోంది.750 మెగావాట్ల వెస్ట్ సేతి, 480 మెగావాట్ల పుకోట్ కర్ణాలి, 450 మెగావాట్ల సేతి రివర్-6 ప్రాజెక్టులపై చర్చించే అవకాశముంది. భారత్ సాయంతో నిర్మించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఈ పర్యటనలో ప్రారంభించనున్నారు. వరదల తర్వాత పునరుద్ధరణ పనులకు భారత్ గ్రాంట్లు, రాయితీ రుణాలు అందించాలని నేపాల్ కోరుతోంది.

హైదరాబాద్‌లోనూ ఈడీ మెరుపుదాడులు

మొదటిపేజీ తరువాయి - ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్, సైబర్ ఫ్రాడ్ సిండికేట్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి ఉక్కుపాదం మోపింది. హైదరాబాద్, ముంబై, పుణే, మెహసానా, సూరత్ నగరాల్లోని 20 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ సోదాల్లో మనీలాండరింగ్‌కు సంబంధించిన కీలక సమాచారాన్ని గుర్తించినట్లు ఈడీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అక్టోబర్ 13న నిర్వహించిన ఈ తనిఖీల్లో కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఇతర సాక్ష్యాధారాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ వెల్లడించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద, ఈ కేసుతో సంబంధం ఉన్న పలు సంస్థలు, వ్యక్తుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసినట్లు పేర్కొంది."ఆల్ పాన్‌ఇల్ ఎక్స్ఛేంజ్",అనే ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రజల నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకుని మోసం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో భాగంగా గతంలో పుణె, ముంబై, బెంగళూరు నగరాల్లో సోదాలు జరిపిన అధికారులు, ఎద్దమ్ ఫిన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు రామ్ యూ రాంధానిని అరెస్టు చేశారు. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు.బాధితుల నుంచి సేకరించిన నిధులను రాంధానికి చెందిన పుణె సంస్థ బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించినట్లు దర్యాప్తులో తేలింది. రాంధాని సంస్థ "ఐపైసా" అనే ప్రత్యేక పేమెంట్ ఫ్లాట్‌ఫామ్‌ను సృష్టించి, దాని ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ ఆపరేటర్ల కోసం 200కు పైగా షెల్ కంపెనీలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా లావాదేవీలు నడిపినట్లు ఈడీ గుర్తించింది.ఈ బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు దుబాయ్ కేంద్రంగా సాగుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ అక్రమ లావాదేవీలకు, నిధుల మళ్లింపునకు కొన్ని సహకార బ్యాంకులు కూడా సహకరించినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా సంపాదించిన డబ్బును మూడు మార్గాల్లో దేశం దాటించినట్లు గుర్తించారు. వాణిజ్య లావాదేవీల ముసుగులో ఓవర్ ఇన్వాయిసింగ్ ద్వారా, ఏపీఎంసీ యూనిట్ల పేరుతో తెరిచిన మ్యూల్ ఖాతాల నుంచి నగదు విత్‌డ్రా చేయడం ద్వారా, చివరిగా క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చి విదేశాలకు తరలించినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది.

బీజేపీకి నచ్చని ఓట్లను తొలగిస్తున్నారు



మొదటిపేజీ తరువాయి - లోపాలున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఈ ప్రక్రియలో పారదర్శకత లేదని, తనకు కూడా నోటీసు వచ్చిందని వెల్లడించారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఓటర్ల జాబితా సవరణలో నిబంధనలను సరిగా పాటించడం లేదని విమర్శించారు.ఓ వ్యక్తి మరణిస్తే వారి ఓటును తొలగించాలని, వేరే ప్రాంతానికి మారితే ఓటును బదిలీ చేయాలని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. అయితే, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి నచ్చని ఓట్లను ఏకపక్షంగా తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగిస్తున్న బీజేపీ.. ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని కూడా తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎన్నికల సంఘం స్వతంత్రతపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియలో చేసిన మార్పులపైనా మహేశ్ గౌడ్ ప్రశ్నలు లేవనెత్తారు. సీఈసీ ఎంపిక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారని కేంద్రాన్ని ప్రశ్నించారు. స్వతంత్ర సంస్థల విధుల్లో కేంద్రం జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్‌ని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు

మొదటిపేజీ తరువాయి - సృష్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు.స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాయచోటి, పుంగనూరులో జరిగిన ఘర్షణలు రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఆందోళనకరమైన పరిణామాలని షర్మిల అన్నారు. ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలను ఘర్షణలు, దాడులతో రణరంగంగా మారుస్తున్నారని విమర్శించారు. "కూటమిది నిజంగా పవిత్ర పాలనే అయితే దాడులు ఎందుకు? బలవంతపు ఏకగ్రీవాలు ఎందుకు? నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడమెందుకు?" అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. నాడు వైసీపీ హయాంలో హింసాకాండ జరిగితే, నేడు టీడీపీ హయాంలో అంతకుమించిన ఘోరాలు జరుగుతున్నాయని ఆమె పోల్చారు.నామినేషన్ కేంద్రాల వద్ద గూండాలు స్వైరవిహారం చేస్తుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు ఎందుకు విఫలమవుతున్నారని షర్మిల నిలదీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ సాగిస్తున్న ఈ దౌర్జన్య వైఖరిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు రాజకీయాలకు, రక్తపాతానికి తావులేదని, అభివృద్ధి కోసం పోటీ పడాలి కానీ భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆమె పలు డిమాండ్లు చేశారు. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నామినేషన్ వేసేలా చూడాలని, బలవంతపు ఏకగ్రీవాలను అడ్డుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ కావాలి కానీ, పగలు ప్రతీకారాలకు వేదిక కాకూడదని ఆమె పేర్కొన్నారు.

దసరా పండుగ నేపథ్యంలోఁ హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీ రద్దీ

మొదటిపేజీ తరువాయి - పయనమవడంతో జాతీయ రహదారులపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం ఉదయం నుంచి వాహనాలు పోటెత్తాయి. ఫలితంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి.పండుగ సెలవుల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుంచే ప్రయాణాలు ప్రారంభం కాగా, శనివారం ఉదయానికి రద్దీ మరింత తీవ్రమైంది. విజయవాడ వైపు వెళ్లే వాహనాలతో టోల్‌ప్లాజా పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. సాధారణ రోజుల్లో కొద్ది నిమిషాల్లోనే దాటాల్సిన టోల్‌గేట్‌ను దాటేందుకు గంటల సమయం పడుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.మరోవైపు, ఇదే మార్గంలోని చౌటుప్పల్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కొనసాగుతుండటం ట్రాఫిక్‌కు అదనపు ఆటంకంగా మారింది. నిర్మాణ పనుల కారణంగా వాహనాలన్నీ సర్వీస్ రోడ్డు మీదుగా నెమ్మదిగా వెళ్లాల్సి రావడంతో, ఇది వాహనాలు నిలిచిపోవడానికి మరో ప్రధాన కారణంగా నిలుస్తోంది.పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు రంగంలోకి దిగి, టోల్‌ప్లాజా వద్ద రద్దీని తగ్గించేందుకు అదనపు సిబ్బందిని మోహరించారు. ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేసే క్రమంలో కొన్ని వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లిస్తున్నారు. అయినప్పటికీ, వాహనాల తాకిడి అధికంగా ఉండటంతో రాకపోకలు నెమ్మదిగానే సాగుతున్నాయి. పండుగ ప్రయాణాలు పూర్తయ్యే వరకూ ఈ రద్దీ కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలి

మొదటిపేజీ తరువాయి - అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఎల్‌నినో తెచ్చిన ముప్పు , ఫిబ్రవరిలోనే వేసవి ప్రారంభం!



మొదటిపేజీ తరువాయి - వేసవి పరిస్థితులు తలెత్తుతాయని క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ నివేదించింది.1950 తర్వాత భారతదేశానికి ప్రస్తుత ఎల్‌నినో అత్యంత తీవ్రమైన ముప్పుగా పరిణమించిందని, ఇప్పటికే వర్షపాత లోటు నమోదవుతుండగా, వెచ్చని శీతాకాలంతో రబీ పంటలపై తీవ్ర ఒత్తిడి పడే అవకాశం ఉందని తెలిపింది. నేలలో తేమ తగ్గడం, భూగర్భ జలాలు పడిపోవడం, రిజర్వాయర్లలో నీరు అడుగంటిపోవడం కారణంగా రాబోయే రబీ పంటలతో పాటు ఆ తర్వాత వచ్చే వేసవి పంటలకు కూడా ముప్పు వాటిల్లుతుందని పేర్కొంది. అయితే ఇప్పటికే వరి, చెరకు, పత్తి వంటి పంటల సాగులో గణనీయంగా లోటు కనిపిస్తోంది.'భారత్‌పై ఎల్‌నినో ముప్పేట ముప్పు' పేరిట క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ అధ్యయన నివేదికను శుక్రవారం విడుదల చేసింది. ఇందులో ఎల్‌నినోకు తోడుగా వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ కలిసి ఉష్ణోగ్రతలను గణనీయంగా పెంచడంతోపాటు నీటి సంక్షోభం మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని హెచ్చరించింది. 2024లో నమోదైన రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలను 2026-27 ఏడాది తిరిగి రాస్తుందని తెలిపింది. ఈ ఏడాది చివరి నాటికి ఎల్‌నినో గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని, దీని ప్రభావం 2027లోనూ కొనసాగుతుందని నివేదిక వెల్లడించింది. అంతేకాకుండా 1901 తర్వాత 2026 ఆగస్టు అత్యంత వేడి నెలగా నిలిచిందని పేర్కొంది.నైరుతి రుతుపవనాలు గత పదేళ్లలో ఎన్నడూ లేనంత బలహీనంగా ఉన్నాయి. దీంతో 13

ఈనెల 19న 'ప్రజా సమస్యల

పరిష్కార వేదిక' రద్దు కలెక్టర్ ఓ.ఆనంద్



అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 17 : ప్రతినిధి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు మరియు మహర్నవమి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నందున, ఈనెల 19వ తేదీ సోమవారం నాడు అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' మరియు 'రెవెన్యూ క్లినిక్' కార్యక్రమాలు జరగవని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలందరూ గమనించాలని ఆయన కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రాలు/అర్జీలు స్వీకరించే కార్యక్రమం ఉండదని, అందువల్ల ఎవరూ అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని జిల్లా పాలనాధికారి విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, జిల్లాలోని క్షేత్రస్థాయి (మండల/డివిజన్) కార్యాలయాల్లో కూడా పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ నిర్వహించబడదని ఆయన స్పష్టం చేశారు. సెలవుల అనంతరం నిర్వహించే తదుపరి కార్యక్రమ సమాచారాన్ని ప్రజలకు తెలియజేస్తామని, ఈ మార్పును గమనించి కలెక్టరేట్‌కు వచ్చి ఇబ్బంది పడకూడదని అనంతపురం జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ ప్రకటన విడుదల చేశారు.

కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా

జాతీయ ప్రధాన కార్యదర్శిగా భూపాళం సతీష్ బాబు



అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 17 :ప్రతినిధి : భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అనంతపురం జిల్లాకు చెందిన భూపాళం సతీష్ బాబు ఎంపికయ్యారు. గత మూడు దశాబ్దాలుగా వినియోగదారుల హక్కుల పరిరక్షణతో పాటు పత్రికారంగంలో ఆయన అందిస్తున్న విశేష సేవలను గుర్తించి, సీసీఐ అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అనంత శర్మ ఈ నియామకాన్ని చేపట్టారు. ఇటీవల రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించిన జాతీయ జనరల్ బాడీ సమావేశంలో జరిగిన ఎన్నికల్లో సతీష్ బాబు విజయం సాధించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ శివ దయాల్ సైని ద్వారా డాక్టర్ అనంత శర్మ ఆయనకు అందజేశారు. సతీష్ బాబు గతంలో ఏపీ సీసీఐ కార్యదర్శిగా, జాతీయ స్థాయి క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా, సంయుక్త కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాళం సతీష్ బాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతాయుతమైన పదవిని అప్పగించిన డాక్టర్ అనంత శర్మకు, సంస్థ అధ్యక్షుడు సెల్వ రాజు, ప్రీతి పాండ్యా మరియు జాతీయ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి నమ్మకాన్ని కాపాడుతూ వినియోగదారుల సేవల కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

గుత్తి మున్సిపల్ చైర్మన్ స్వతంత్ర అభ్యర్థిగా

ఎన్. ప్రభావతి నామినేషన్



గుత్తి (తెలుగు కలం) అక్టోబర్ 17 :ప్రతినిధి : అనంతపురం జిల్లా గుత్తి మున్సిపాలిటీ ఎన్నికల వేడి ఒక్కసారిగా రాజుకుంది. గుత్తి మున్సిపాలిటీ చైర్మన్ పీఠం ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో స్థానిక రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఎపిఎంఆర్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ ప్రసాద్ సతీమణి ఎన్. ప్రభావతి గుత్తి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా స్వతంత్ర హోదాలో పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఆమె శనివారం తన నామినేషన్ పత్రాలను గుత్తి మున్సిపల్ ఎన్నికల అధికారులకు అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ కేంద్రానికి ఎపిఎంఆర్పీఎస్ నాయకులు, మద్దతుదారులు, స్థానిక ప్రజలతో కలిసి తరలివచ్చిన ప్రభావతి, అధికారులను కలసి నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు వాటిని స్వీకరించి రశీదును అందజేశారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మాట్లాడిన ప్రభావతి, గుత్తి మున్సిపాలిటీ అభివృద్ధికి మరియు అణగారిన వర్గాల సంక్షేమానికి శ్రమిస్తానని వెల్లడించారు. ఎస్సీ మహిళలకు దక్కిన ఈ అవకాశాన్ని ప్రజల సేవకే అంకితం చేస్తానని, పట్టణ పరిధిలోని తాగునీరు, డ్రైనేజీ, రహదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి ప్రజల ఆదరాభిమానాలతో విజయం సాధిస్తామని ఎపిఎంఆర్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ ప్రసాద్ ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ప్రభావతి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయడంతో స్థానిక మున్సిపల్ పోరు మరింత ఆసక్తికరంగా మారింది.

గుత్తిలో జోరుగా నామినేషన్ల పర్వం

రెండో రోజు మొత్తం 42 దరఖాస్తులు దాఖలు



గుత్తి (తెలుగు కలం) అక్టోబర్ 17 : ప్రతినిధి : గుత్తి పట్టణంలో స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. నామినేషన్ల స్వీకరణ రెండో రోజు ముగిసేనాటికి వివిధ స్థానాలకు మొత్తం 42 నామినేషన్లు నమోదయ్యాయి. ?మున్సిపల్ చైర్పర్సన్ స్థానం కోసం మొత్తం 4 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో ఒక గుర్తింపు పొందిన ప్రధాన పార్టీ తరపున, బిఎస్పీ నుంచి ఒకటి చొప్పున నామినేషన్లు రాగా, మరో ఇద్దరు స్వాతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇక కౌన్సిలర్ అభ్యర్థుల స్థానాలకు సంబంధించి మొత్తం 38 నామినేషన్లు నమోదయ్యాయి. పార్టీల వారీగా పరిశీలిస్తే, తెదేపా తరపున అత్యధికంగా 32 నామినేషన్లు దాఖలు కాగా, వైసీపీ నుంచి 4, బీజేపీ నుంచి 2, సీపీఎం నుంచి 2, జనసేన పార్టీ (జేఎస్పీ) నుంచి 1 నామినేషన్ దాఖలయ్యాయి. అలాగే మరో అభ్యర్థి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. నామినేషన్ల గడువు సమీపిస్తుండటంతో గుత్తిలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు, వారి అనుచరులతో సందడి నెలకొంది.

నేటితో ముగియనున్న నామినేషన్ల గడువు..

అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ, పట్టణంలో హైటెన్షన్ వాతావరణం!

అనంతపురం(తెలుగు కలం) అక్టోబర్ 17 : ప్రతినిధి : నామినేషన్ల పర్వం తుది అంకానికి చేరుకుంది. నామినేషన్ దాఖలు చేయడానికి నేడు ఆదివారం చివరి రోజు కావడంతో రాజకీయ వర్గాల్లో, అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గడువు సమీపిస్తుండటం మరియు నేడే ఆఖరి గడువు కావడంతో ఆశావహులు, అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించేందుకు అధికారుల కార్యాలయాల వద్దకు భారీగా తరలివస్తున్నారు. చివరి నిమిషంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా త్వరగా ప్రక్రియ పూర్తి చేసే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో నామినేషన్ల కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. మరోవైపు, నామినేషన్ల వేళ గుత్తి రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఒకవైపు సమయం లేక అభ్యర్థులు పడుతున్న ఇబ్బందులు ఒకెత్తైతే, గత రెండు రోజులుగా తెదేపా, వైకాపా నాయకుల మధ్య జరుగుతున్న చిన్నపాటి ఘర్షణలు, వాగ్వాదాలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తున్నాయి. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో ఎలాంటి పరిస్థితులకు దారితీస్తాయోనని ఇరు పార్టీల శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియక పోలీసు యంత్రాంగం తలపట్టుకుంటోంది. నేడు నామినేషన్లకు ఆఖరి రోజు కావడంతో ఎక్కడ ఏ క్షణాన ఏం జరుగుతుందోనని స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలో పడ్డారు. ఒకవేళ నేడు నామినేషన్ల చివరి రోజు గొడవలు మళ్లీ తలెత్తితే పోలీసులు ఉక్కుపాదం మోపి అదుపు చేస్తారా లేక చేతులెత్తేస్తారా అని పట్టణ ప్రజలు తీవ్ర చర్చించుకుంటున్నారు. నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగుస్తుందా లేదా అనేదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి





నంద్యాల (తెలుగు కలం) అక్టోబర్ 17 : ప్రతినిధి : ఎంపీటీసీ, జెడ్పీటీసీ-2026 రెండో సాధారణ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల విధివిధానాలపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు, నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తతతో, సమన్వయంతో తమకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన సమయపాలనను కచ్చితంగా పాటించాలని, నిర్ణీత సమయం నుండి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే నామినేషన్లను స్వీకరించి, గడువు ముగిసిన అనంతరం నిబంధనలకు విరుద్ధంగా ఎవరినీ అనుమతించకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలని, నిర్దేశిత పరిధిలో వాహనాల రాకపోకలను నిరోధిస్తూ బారికేడింగ్ ఏర్పాటు చేసి పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. అలాగే, సమర్పించిన ప్రతి నామినేషన్ పత్రంలో అభ్యర్థి వివరాలు, సంతకాలు, ప్రతిపాదకుల వివరాలు, డిపాజిట్, అవసరమైన కేటగిరీ రిజర్వేషన్ ద్రువపత్రాలను నిశితంగా పరిశీలించాలని, రికార్డులను పక్కాగా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల ఉపసంహరణకు సంబంధించిన ఫారమ్-7 స్వీకరణలోనూ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని అధికారులకు స్పష్టం చేశారు. నామినేషన్ ఉపసంహరణ ప్రకటనలను ఎవరు సమర్పించాలి, ఏ విధానంలో ద్రువీకరించాలి అనే అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి దశ నమోదును రికార్డుల్లో భద్రపరచాలని వివరించారు. ?దీంతోపాటు, ఎన్నికల నిర్వహణలో భాగమైన రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలలో ముందస్తు ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు. ఎన్నికల సిబ్బందికి కావాల్సిన తాగునీరు, నీడ, టాయిలెట్లు, వసతి సౌకర్యాలను కల్పించడంతోపాటు ఎన్నికల పరిశీలకుల పర్యవేక్షణకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు శాఖతో సమన్వయం పాటిస్తూ సమర్థవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రియాంక, జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, పలువురు జిల్లా అధికారులు, తాసిల్దారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ ఎన్నికల ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు మరియు కౌంటింగ్ హాల్ పరిశీలన



కళ్యాణదుర్గం (తెలుగు కలం) అక్టోబర్ 17 : ప్రతినిధి : అనంతపురం జిల్లా స్థానిక సంస్థల మరియు మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలో సాగుతున్న ముందస్తు ఏర్పాట్లను మరియు భద్రతా చర్యలను అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో మరియు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలనే లక్ష్యంతో అధికారులతో కలిసి ఆయన నియోజకవర్గ కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. ?ముందుగా నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించిన జాయింట్ కలెక్టర్, అక్కడ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించే విధానం, దరఖాస్తుల పరిశీలన మరియు హెల్ప్ డెస్క్ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అభ్యర్థులకు మరియు వారి ప్రతి ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాల నిఘా ఏర్పాట్లను, పోలీస్ బందోబస్తును సమీక్షించి పలు సూచనలు చేశారు. ?అనంతరం, పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలు మరియు బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లతో పాటు ఓట్ల లెక్కింపు నిర్వహించే కౌంటింగ్ హాల్‌ను ఆయన పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, రౌండ్ ది క్లాక్ పోలీస్ పహారా, విద్యుత్ అంతరాయం కలగకుండా పవర్ బ్యాకప్ సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కౌంటింగ్ హాల్‌లో టేబుళ్ల అమరిక, కౌంటింగ్ సిబ్బందికి కావాల్సిన వసతులు, ఏజెంట్ల కూర్చునే స్థలాలు, రక్షణ గోడలు మరియు నిరంతర సీసీటీవీ కవరేజ్ వంటి అన్ని అంశాలను ఆయన సరిచూశారు. ?ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, "మున్సిపల్ ఎన్నికలు అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా మరియు ప్రశాంతమైన వాతావరణంలో పూర్తి చేయడమే జిల్లా యంత్రాంగం యొక్క ప్రధాన లక్ష్యం. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాలి. నామినేషన్ స్వీకరణ నుంచి ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలోనూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి" అని స్పష్టం చేశారు. ?ఈ తనిఖీ కార్యక్రమంలో కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు , అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, స్థానిక తహశీల్దార్, పోలీసు అధికారులు మరియు ఇతర శాఖల మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్





ధర్మవరం (తెలుగు కలం) అక్టోబర్ 17 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పురపాలక సంఘ చైర్‌పర్సన్ మరియు వార్డు సభ్యుల ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది. నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పట్టణంలోని బీఎన్ఆర్ హైస్కూల్ తో పాటు ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను ఆయన సందర్శించి, ఏర్పాట్లను నిశితంగా తనిఖీ చేశారు. ?ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ అంతా అత్యంత ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా జరగాలని స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరిస్తూ, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎన్నికలను సజావుగా పూర్తి చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు, వారి ప్రతిపాదకులు మరియు సాధారణ ప్రజలకు నామినేషన్ ప్రక్రియ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. వేసవి తీవ్రత లేదా ఎండ నుంచి ఉపశమనం కోసం నీడ, తాగునీటి సదుపాయంతో పాటు రద్దీని నివారించేందుకు క్యూలైన్లు, బారికేడ్లు, కట్టుదిట్టమైన పోలీస్ భద్రతను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా, అభ్యర్థులు గందరగోళానికి గురికాకుండా తమకు కేటాయించిన కేంద్రాల్లోనే నామినేషన్లు సమర్పించేలా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎలాంటి సమయ జాప్యం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ధర్మవరం రెవెన్యూ డివిజనల్ అధికారి రాంభూపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, ధర్మవరం తహసీల్దార్‌తో పాటు పలుశాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతకల్లు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా యశోద ఖరారు!

పవన్ కుమార్ గౌడ్ భార్యకు అవకాశం కల్పించిన పార్టీ అధిష్టానం

మున్సిపల్ పీఠంపై గురిపెట్టిన పార్టీలు..

అభ్యర్థి ప్రకటనతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి

ఎన్నికల బరిలో కీలక పరిణామం.. ప్రచార వ్యూహాలపై ఉత్కంఠ



గుంతకల్లు(తెలుగు కలం) అక్టోబర్ 17 : గుంతకల్లు మున్సిపల్ చైర్మన్ పదవికి అభ్యర్థి ఎంపికలో పార్టీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. చైర్మన్ అభ్యర్థిగా పవన్ కుమార్ గౌడ్ భార్య యశోద పేరును ఖరారు చేస్తూ ప్రకటించింది. ఈ ప్రకటనతో పట్టణ రాజకీయాల్లో మున్సిపల్ ఎన్నికల వేడి మరింత పెరిగింది. చైర్మన్ పదవిని దక్కించుకోవడమే లక్ష్యంగా రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్న తరుణంలో యశోద అభ్యర్థిత్వం ఖరారు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో చైర్మన్ అభ్యర్థి ఎవరనే అంశంపై కొంతకాలంగా రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో పార్టీ నాయకత్వం యశోద పేరును ప్రకటించడంతో అభ్యర్థి ఎంపికపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. పవన్ కుమార్ గౌడ్ కుటుంబానికి చెందిన యశోదకు అవకాశం కల్పించడం ద్వారా పార్టీ అధిష్టానం తన నిర్ణయాన్ని స్పష్టం చేసింది.గుంతకల్లు మున్సిపాలిటీలో చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడం అన్ని రాజకీయ పార్టీలకు కీలకంగా మారింది. పట్టణంలోని వార్డుల్లో బలాన్ని పెంచుకోవడం, ప్రజల మద్దతును కూడగట్టుకోవడం, అభ్యర్థుల ఎంపికలో సమతుల్యత పాటించడం వంటి అంశాలు ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనున్నాయి. ఈ నేపథ్యంలో చైర్మన్ అభ్యర్థిగా యశోద పేరు ప్రకటించడం రాజకీయ సమీకరణాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది.అభ్యర్థిత్వం ఖరారైన నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఎన్నికల కార్యాచరణపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వార్డుల వారీగా ప్రచారాన్ని విస్తరించడం, స్థానిక సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఓటర్లను ఆకట్టుకునే విధంగా వ్యూహాలను రూపొందించడం వంటి అంశాలు రానున్న రోజుల్లో ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. మరోవైపు ఇతర రాజకీయ పార్టీల అభ్యర్థుల ఎంపిక, వారి ప్రచార కార్యక్రమాలు కూడా గుంతకల్లు రాజకీయ వాతావరణాన్ని ప్రభావితం చేయనున్నాయి.మొత్తంగా, గుంతకల్లు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా యశోద పేరును అధిష్టానం ఖరారు చేయడంతో ఎన్నికల పోటీపై ఆసక్తి పెరిగింది. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులు ప్రజల ముందుకు ఎలాంటి హామీలతో వస్తారు, ఓటర్ల మద్దతును ఏ విధంగా కూడగడతారు, చైర్మన్ పీఠాన్ని ఏ పార్టీ దక్కించుకుంటుందన్నది వేచి చూడాల్సి ఉంది.

నంద్యాలలో ప్రశాంతంగా

ముగిసిన రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ



నంద్యాల(తెలుగు కలం) అక్టోబర్ 17 : నంద్యాల జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రెండో రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా రెండో రోజు చైర్‌పర్సన్ పదవులకు 34 నామినేషన్లు, వార్డు మెంబర్ పదవులకు 531 నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటి రోజు అంటే అక్టోబర్ 16న దాఖలైన చైర్‌పర్సన్ పదవికి సంబంధించిన ఒక నామినేషన్, వార్డు మెంబర్ పదవులకు దాఖలైన 17 నామినేషన్లను కలుపుకొని, ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా చైర్‌పర్సన్ పదవులకు మొత్తం 35 నామినేషన్లు, వార్డు మెంబర్ పదవులకు మొత్తం 548 నామినేషన్లు దాఖలైనట్లు కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు మరియు నిబంధనలకు అనుగుణంగానే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

గుంతకల్లు మున్సిపల్ ఎన్నికల్లో హోరాహోరీ!

నామినేషన్లలో టీడీపీకి 68, వైసీపీకి 66

చైర్‌పర్సన్ పదవికి టీడీపీ నుంచి ఒక్క నామినేషన్



గుంతకల్లు, (తెలుగు కలం) అక్టోబర్ 17 : గుంతకల్లు మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పార్టీల మధ్య పోటీ హోరాహోరీగా మారింది. చైర్‌పర్సన్, వార్డు సభ్యుల పదవులకు నామినేషన్ల ప్రక్రియలో రాజకీయ సందడి నెలకొంది. తాజాగా వెల్లడైన వివరాల ప్రకారం టీడీపీ 68, వైసీపీ 66 నామినేషన్లు దాఖలు చేయగా, రెండు పార్టీల మధ్య కేవలం రెండు నామినేషన్ల తేడా ఉంది. జనసేన తరపున మూడు, బీఎస్పీ, బీజేపీ, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల నుంచి ఒక్కొక్క నామినేషన్ దాఖలైంది. స్వతంత్ర అభ్యర్థులుగా 14 మంది నామినేషన్లు సమర్పించారు. చైర్‌పర్సన్ పదవికి టీడీపీ నుంచి ఒక్క నామినేషన్ దాఖలైనట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. ప్రధాన పార్టీల మధ్య నామినేషన్ల సంఖ్యలో స్వల్ప తేడా ఉండటంతో ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల సంఖ్య తేలనుంది. వార్డుల వారీగా అభ్యర్థుల బలాబలాలు, ఓటర్ల మద్దతు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపనున్నాయి.

అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో వేడెక్కిన మున్సిపల్ ఎన్నికల పోరు

మేయర్, డివిజన్ స్థానాలకు భారీగా నామినేషన్లు

అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 17 :ప్రతినిధి : సాధారణ మున్సిపల్ ఎన్నికలు - 2026 ప్రక్రియ ఊపందుకోవడంతో అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మేయర్ పదవితో పాటు కార్పొరేషన్‌లోని పలు డివిజన్ల నుంచి పోటీ చేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు భారీగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. నగరంలోని నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద అభ్యర్థులు, వారి మద్దతుదారుల కోలాహలంతో

ఎన్నికల సందడి స్పష్టంగా కనిపిస్తోంది. నగరాభివృద్ధి, తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళ్తామని నామినేషన్లు వేసిన పలువురు అభ్యర్థులు







మీడియా సమక్షంలో వెల్లడించారు. మేయర్ స్థానానికి పోటీ పడుతున్న ప్రముఖ నాయకులు తమ మద్దతుదారులతో కలిసి ర్యాలీలుగా వచ్చి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. ప్రతి డివిజన్ నుంచి గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీల శ్రేణులు ప్రచార వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. నామినేషన్ల ఘట్టం పూర్తికాగానే పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియల అనంతరం తుది పోటీలో నిలిచే అభ్యర్థుల జాబితా ఖరారు కానుంది.

ఐక్య విద్యార్థి, యువజన సంఘాల సంపూర్ణ మద్దతుతో ముందంజలో వైసీపీ మేయర్ అభ్యర్థి చిట్లూరు రమేశ్ గౌడ్

అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 17 :ప్రతినిధి : అనంతపురం నగర వైయస్సార్ సీపీ మేయర్ అభ్యర్థిగా ప్రకటించబడిన చిట్లూరు రమేశ్ గౌడ్‌కు నగరంలోని ఐక్య విద్యార్థి, యువజన సంఘాలు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో విద్యార్థి, యువజన నాయకులు పాల్గొని రమేశ్ గౌడ్ అభ్యర్థిత్వంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతపురం నగర సర్వాంగీణ అభివృద్ధి ఒక్క రమేశ్ గౌడ్‌తోనే సాధ్యమవుతుందని విద్యార్థి నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో మాట్లాడిన **AISB** రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వి, **PSF** రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆలం, **PSU** అధ్యక్షులు మంజుల నరేంద్ర, **AISP** రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహ, **AISO** రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరంజన్, **USFI** జిల్లా కార్యదర్శి భీమేష్, **AISB** జిల్లా కార్యదర్శి పోతులయ్య మరియు **PSF** జిల్లా కార్యదర్శి ప్రతిభ భారతి తదితరులు చిట్లూరు రమేశ్ గౌడ్ చేసిన ప్రజా సేవలను కొనియాడారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ వర్గాల హక్కుల కోసం కులమతాలకు అతీతంగా గళం విప్పిన నిజమైన ప్రజా నాయకుడు రమేశ్ గౌడ్ అని స్పష్టం చేశారు. యువతకు మరియు విద్యార్థులకు ఎలాంటి సమస్య ఎదురైనా



ముందుండి పరిష్కరించేందుకు ఆయన చూపిన చొరవ ప్రశంసనీయమని పేర్కొన్నారు. గతంలో అనంతపురం నగరానికి మేయర్లుగా వ్యవహరించిన వారు స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని విద్యార్థి సంఘాల నాయకులు విమర్శించారు. వైసీపీ నాయకుడిగా ఎల్లప్పుడూ ప్రజలకు అండగా నిలిచే రమేశ్ గౌడ్‌కు మేయర్ అభ్యర్థిగా అవకాశం రావడం నగర ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. ఆయన మేయర్‌గా గెలుపొందితే నగర అభివృద్ధి సాధించడంతో పాటు విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యార్థి, ప్రజా వ్యతిరేక విధానాలపై విద్యార్థి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ విధానాల వల్ల సామాన్య ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, కాబట్టి అనంతపురం మేయర్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ఇవ్వకూడదని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి చిట్లూరు రమేశ్ గౌడ్ విజయానికి ఐక్య విద్యార్థి, యువజన సంఘాల తరపున ప్రత్యక్షంగా క్షేత్రస్థాయి ప్రచారం నిర్వహిస్తామని ప్రకటించారు. అనంతపురం నగరాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దడానికి యువత, విద్యార్థులు మరియు నగర ప్రజలందరూ రమేశ్ గౌడ్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు సాహిత్, వినోద్, దామో తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని యూట్యూబ్ ఛానళ్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

ప్రజలు, బాధ్యతాయుత పౌరుల విజ్ఞప్తి

అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 17 : ప్రతినిధి : ఎలాంటి చట్టపరమైన అనుమతులు, అవసరమైన గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబ్ ఛానళ్ల వ్యవహారంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. జర్నలిజం పేరుతో వార్తలు ప్రసారం చేస్తున్న వివిధ ఛానళ్ల కార్యకలాపాలను సమగ్రంగా పరిశీలించి, నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు ఆధారాలతో తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా విస్తరిస్తున్న నేపథ్యంలో యూట్యూబ్ వేదికగా అనేక ఛానళ్లు వార్తలు, స్థానిక సమస్యలు, ప్రజా సమస్యలకు సంబంధించిన అంశాలను ప్రసారం చేస్తున్నాయి. అయితే, జర్నలిజం పేరును వాడుకుంటూ తప్పుదు సమాచారాన్ని ప్రచారం చేయడం, వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆధారాలు లేని కథనాలను ప్రసారం చేయడం వంటి ఫిర్యాదులు తీవ్రమవుతున్నాయని సమాజంలోని పలు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇటువంటి అంశాలపై అధికారులు



క్షుణ్ణంగా పరిశీలన జరిపి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేస్తున్నారు. ప్రజలకు నిష్పక్షపాతంగా, వాస్తవ సమాచారాన్ని అందించడమే మీడియా యొక్క ప్రాథమిక బాధ్యతని, ఈ బాధ్యతను విస్మరించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సదరు ఛానళ్ల నిర్వహణ పద్ధతులు, వాటి ప్రసారాల స్వరూపం, వర్తించే సమాచార-ప్రసార చట్టాలు మరియు నిబంధనలను కూలంకషంగా పరిశీలించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. అదే సమయంలో, నిబంధనలకు కట్టుబడి స్వతంత్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులు, డిజిటల్ మీడియా ప్రతినిధుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చూసుకోవాలని కోరుతున్నారు. చట్టబద్ధంగా, బాధ్యతాయుతంగా వార్తలు ప్రసారం చేసే వారికి అనవసర ఇబ్బందులు ఎదురుకాకుండా తగిన రక్షణ కల్పించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించినట్లు పక్కా ఆధారాలతో నిర్ధారణ అయిన ఛానళ్లపై మాత్రమే చట్టపరమైన చర్యలు తీసుకొని, డిజిటల్ మీడియా రంగంలో విలువలతో కూడిన బాధ్యతాయుతమైన జర్నలిజాన్ని ప్రోత్సహించాలని అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి

ఆస్పత్రి వద్ద కుటుంబసభ్యుల ఆందోళన



అనంతపురం(తెలుగు కలం) అక్టోబర్ 17 : ప్రతినిధి : అనంతపురం నగరంలోని పాత ఊరు ప్రాంతంలో తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. స్థానికంగా ఉన్న ఒక ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్య వైద్యం కారణంగా ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిందనే వార్త కలకలం రేపింది. బాధితురాలి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో వెంటనే వేరే ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.?బాధితుల వివరాల ప్రకారం, సదరు మహిళ స్వల్ప అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం పాత ఊరులోని ఆర్ఎంపీ క్లినిక్‌కు వెళ్లారు. అక్కడ ఆర్ఎంపీ డాక్టర్ ఇచ్చిన మందులు, ఇంజెక్షన్ల కారణంగా ఆమె ఆరోగ్యం క్షణాల్లో క్షీణించి స్పృహతప్పి పడిపోయింది. పరిస్థితి విషమించడంతో వెంటనే సమీపంలోని పెద్ద ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ?ఈ ఘోర ప్రమాదంతో ఆగ్రహానికి గురైన బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున క్లినిక్ మరియు ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. సరైన అర్హత మరియు అనుభవం లేకుండా విచక్షణారహితంగా మందులు వాడటం వల్లే తమ మనిషి ప్రాణాలు పోయాయని, సదరు ఆర్ఎంపీ డాక్టర్‌ను తీవ్రంగా ప్రశ్నిస్తూ నిలదీశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని సమీక్షించి, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. అర్హత లేని వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ధర్మవరంలో ప్రశాంతంగా ముగిసిన రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ

ధర్మవరం (తెలుగు కలం) అక్టోబర్ 17 :



శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికల సందడి కొనసాగుతోంది. రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా పూర్తయింది. కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులకు సమర్పించారు. ఈ నామినేషన్ల ఘట్టాన్ని పురస్కరించుకుని పట్టణంలో పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఎన్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు నామినేషన్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తును మోహరించారు. అడిషనల్ ఎస్పీ కేవీ మహేష్, డీఎస్పీ బీవీ జగన్నాథరాజుల ప్రత్యక్ష పర్యవేక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షించారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు నామినేషన్ల దాఖలుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చినప్పటికీ, పోలీసులు పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియ సాగేలా చర్యలు తీసుకున్నారు. అభ్యర్థులందరూ ప్రశాంత వాతావరణంలో తమ నామినేషన్లు వేసేలా తగిన వాతావరణాన్ని కల్పించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం డీఎస్పీ బీవీ జగన్నాథరాజు మాట్లాడుతూ, ధర్మవరం మున్సిపల్ ఎన్నికల రెండో రోజు నామినేషన్ల స్వీకరణ విజయవంతంగా, ప్రశాంతంగా పూర్తయిందని వెల్లడించారు. కూటమి మరియు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయాల్లో ఎలాంటి వివాదాలు, గొడవలు జరగకుండా పోలీసు శాఖ తరపున పటిష్ట భద్రత కల్పించినట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ అంతా ముగిసేవరకు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

దసరా మెగా షటిల్ టోర్నమెంట్ విజయవంతం

విజేతలకు నగదు బహుమతులు అందజేసిన రిటైర్డ్ ఎమ్మార్వో వెంకటేశ్వర్లు, పల్లెం వేణుగోపాల్



ధర్మవరం (తెలుగు కలం) అక్టోబర్ 17 : శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని చెరువు కట్ట కింద నిర్వహించిన దసరా మెగా షటిల్ టోర్నమెంట్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ముఖ్య అతిథులుగా హాజరైన రిటైర్డ్ ఎమ్మార్వో వెంకటేశ్వర్లు, పల్లెం వేణుగోపాల్ చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్‌లో మొదటి బహుమతిగా ఆది, డాక్టర్ మదన్మోహన్ , జట్టుకు రూ.10,000, రెండో బహుమతిగా కృష్ణమోహన్, మహేష్ జట్టుకు రూ.5,000, మూడో బహుమతిగా భగవాన్, దాస్ జట్టుకు రూ.2,500, నాలుగో బహుమతిగా మురళి, వినోద్ జట్టుకు రూ.1,000 నగదు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన ఫయాజ్, ప్రేమ్, డాక్టర్ మదన్మోహన్ , రాజా, హరి, రాఘవ, విజయ, ఈశ్వరయ్య, తేజ, నాగేంద్ర, ప్రవీణ్, మదన్, కృష్ణప్రసాద్ టీచర్ తదితరులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు యువతలో క్రీడల పట్ల ఆసక్తిని ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు.

ఏపీలో స్థానిక ఎన్నికల పోరు రెండో రోజు భారీగా నామినేషన్లు

రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికల సందడి ప్రారంభమైంది. రెండో రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కోలాహలంగా సాగింది. నామినేషన్లకు ఇంకా ఒక్కరోజే ఉండటంతో ఇవాళ భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి.

రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ రెండో రోజు నామినేషన్ కేంద్రాల వద్ద కోలాహలం నెలకొంది. ఇంకా ఒక్కరోజే ఉండటంతో అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపాలిటీ ఛైర్మన్ అభ్యర్థిగా టీడీపీ తరపున ఎనుముల పుష్ప నామినేషన్ సమర్పించారు. బాపట్ల జిల్లా చీరాల పురపాలక సంఘానికి వార్డు సభ్యుల అభ్యర్థులు నామపత్రాలు దాఖలు చేశారు. అయితే ఛైర్మన్ పదవికి ఒక్క నామినేషన్ రాకపోవడం విశేషం. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మున్సిపాలిటీలో వార్డు సభ్యులుగా పోటీ చేసేందుకు అనేకమంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. స్పీకర్ అయన్నపాత్రుడు సతీమణి పద్మావతి ఛైర్‌పర్సన్ పదవికి ఇప్పటికే నామినేషన్ వేయగా వైఎస్సార్సీపీ నుంచి చింతకాయల సన్యాసిపాత్రుడు సతీమణి మున్సిపల్ మాజీ ఛైర్మన్? అనిత నామినేషన్ దాఖలుకు సిద్ధమవుతున్నారు. మార్కాపురం మున్సిపాలిటీలో నామినేషన్ల పర్వం రెండో రోజు ఉత్సాహంగా కొనసాగింది. ఇవాళ మొత్తం 84 నామినేషన్లు దాఖలయ్యాయి. కూటమి ఛైర్మన్? అభ్యర్థిగా వక్కలగడ్డ మల్లికార్జున్?తో పాటు పలువురు వార్డు సభ్యులుగా నామపత్రాలు దాఖలు చేశారు. కనిగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా వైఎస్సార్సీపీ తరపున కేంద్రమాజీ మంత్రి పులివెంకటరెడ్డి మనుమరాలు శాంతిరెడ్డి నామపత్రం దాఖలు చేశారు. అద్దంకి పురపాలక సంఘం ఛైర్మన్?, కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఛైర్మన్? అభ్యర్థిగా కూటమి తరపున కాకాని అశోక్, వైఎస్సార్సీపీ అభ్యర్థిగా ఉడత్తు సురేశ్?తో పాటు మరో ముగ్గురు నామినేషన్లు సమర్పించారు. అదేవిధంగా 32 వార్డులకు మొత్తం 37 నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. వీటిలో వైఎస్సార్సీపీ తరపున 25, తెలుగుదేశం తరపున 10, జనసేన తరపున 2 నామినేషన్లు ఖరైనట్లు సమాచారం. మదనపల్లె మున్సిపాలిటీలో రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. ఇవాళ మొత్తం 90 మంది అభ్యర్థులు నామపత్రాలు దాఖలు చేశారు. పుంగనూరు, రాయచోటి పురపాలక సంఘాల్లో జరిగిన ఘటనలను తీవ్రంగా పరిగణించిన పోలీసులు నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఛైర్మన్ అభ్యర్థిగా కూటమి తరపున గుండ్లపల్లె శ్రీరామ్, వైఎస్సార్సీపీ అభ్యర్థిగా చినబాబు నామినేషన్ వేశారు. పుంగనూరులో రెండో రోజు 59 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ 44, బీజేపీ 3, జనసేన 8, స్వతంత్ర అభ్యర్థులుగా నలుగురు నామపత్రాలు దాఖలు చేశారు.

ధర్మవరం పురపాలక ఎన్నికలు ఊపందుకున్న

నామినేషన్ల ప్రక్రియ శనివారం ఒక్కరోజే 117 దాఖలు



ధర్మవరం (తెలుగు కలం) అక్టోబర్ 17 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పురపాలక సంఘ పరిధిలో వార్డు సభ్యుల నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. మొత్తం 48 వార్డులకు గాను అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. శనివారం ఒక్కరోజే వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల నుంచి మొత్తం 117 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఇప్పటివరకు నమోదైన సంచిత (క్యూములేటివ్) నామినేషన్ల సంఖ్య 180కి చేరింది.

పార్టీల వారీగా శనివారం దాఖలైన నామినేషన్ల వివరాలు:

తెలుగుదేశం పార్టీ : 55 వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ : 34 జనసేన పార్టీ : 16 స్వతంత్ర అభ్యర్థులు : 7 భారతీయ జనతా పార్టీ : 5ఈ రోజు దాఖలైన నామినేషన్లలో బహుజన్ సమాజ్ పార్టీ , సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, ఎన్‌సిపి తో పాటు ఇతర పార్టీల నుంచి ఎలాంటి నామినేషన్లు నమోదు కాలేదు. ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో వేగంగా ముందుకు సాగుతోందని సహ ఎన్నికల అధికారి మరియు ధర్మవరం మునిసిపల్ కమిషనర్ తెలిపారు.

గుంతకల్లులో వైభవంగా శ్రీవారి గరుడోత్సవం

వెదురు పల్లకిలో గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు

నాలుగు కిలోమీటర్ల పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు



గుంతకల్లు, (తెలుగు కలం) అక్టోబర్ 17 : అనంతపురం జిల్లా గుంతకల్లులో శ్రీవారి గరుడోత్సవం వైభవంగా నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా రాజేంద్రనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర భక్త మండలి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఈ వేడుకను ఘనంగా జరిపారు. తొలిసారిగా ఆగమ శాస్త్ర ప్రకారం వెదురు పల్లకిలో గరుడ వాహనంపై స్వామివారిని కొలువుదీర్చి పట్టణంలో పల్లకిసేవ నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో గరుడ వాహనంపై కొలువుదీరిన శ్రీవారిని పట్టణ ప్రధాన రహదారుల మీదుగా ఊరేగించారు. పొట్టి శ్రీరాములు సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా సాగిన ఈ పల్లకిసేవ సుమారు నాలుగు కిలోమీటర్లు కొనసాగింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గోవింద నామస్మరణతో పట్టణ వీధులు మార్మోగాయి. గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపును తిలకించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గరుడోత్సవం గుంతకల్లులో ఆధ్యాత్మిక సందడిని నింపింది. స్వామివారి కృపాకటాక్షాలు తమపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.

శ్రీసత్యసాయి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

టెకీలకు తీవ్ర గాయాలు, పరారీలో కారు డ్రైవర్



బాగేపల్లి (తెలుగు కలం) అక్టోబర్ 17 : ప్రతినిధి : శ్రీసత్యసాయి జిల్లా బాగేపల్లి చెక్‌పోస్ట్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లోని ఐబీఎం కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న శ్రీకాంత్, అశ్వనిరాణి ద్విచక్ర వాహనంపై బెంగళూరు వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ మరియు జార్ఖండ్‌కు చెందిన అశ్వనిరాణి **TS** 34 + 2233 నెంబర్ గల బైక్‌పై ప్రయాణిస్తున్నారు. బాగేపల్లి చెక్‌పోస్ట్ వద్దకు చేరుకునేసరికి వెనుక వైపు నుంచి అత్యంత వేగంగా వచ్చిన ఓ కారు వారి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఐలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఇద్దరు టెకీలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో వారిద్దరి కాళ్ళు విరిగిపోయాయి. సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ సంఘటన స్థలం నుంచి పరారయ్యాడు.సమాచారం అందుకున్న బాగేపల్లి పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న కారు డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

తాడిపత్రి మున్సిపాలిటీలో రెండవ రోజు జోరుగా

నామినేషన్ల పర్వం.. మొత్తం 146 నామినేషన్లు దాఖలు



తాడిపత్రి(తెలుగు కలం) అక్టోబర్ 17 :తాడిపత్రి మున్సిపాలిటీ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. రెండవ రోజు నామినేషన్ల గడువు ముగిసే సమయానికి వివిధ పార్టీల అభ్యర్థుల నుంచి భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. రెండవ రోజు ఒక్కరోజే 118 నామినేషన్లు దాఖలు కాగా, మొదటి రోజుతో కలిపి మొత్తం నామినేషన్ల సంఖ్య 146కి చేరింది. కౌన్సిలర్ అభ్యర్థులుగా తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నుంచి 86 మంది, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్సీపీ) నుంచి 54 మంది నామినేషన్లు సమర్పించారు. అలాగే బీజేపీ మరియు సీపీఐ పార్టీల నుంచి ఒక్కో అభ్యర్థి చొప్పున నామినేషన్ వేశారు. ఇక మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి స్థానం కోసం వైఎస్సార్సీపీ నుంచి ఇద్దరు నామినేషన్లు దాఖలు చేయగా, కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకరు నామినేషన్ వేశారు. రెండు రోజుల నామినేషన్ల సేకరించిన గణాంకాలను పరిశీలిస్తే, టీడీపీ తరపున మొదటి రోజు 15, రెండవ రోజు 71 కలిపి మొత్తం 86 నామినేషన్లు దాఖలయ్యాయి. అదేవిధంగా వైఎస్సార్సీపీ తరపున మొదటి రోజు 9, రెండవ రోజు 45 కలిపి మొత్తం 54 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటితో పాటు సీపీఐ మరియు బీజేపీ పార్టీల నుంచి ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. తాడిపత్రిలో ప్రధాన రాజకీయ పార్టీల హడావుడితో ఎన్నికల వాతావరణం వేడెక్కింది.

గుత్తిలో రాజుకున్న రాజకీయ వేడి

"కడప రాజకీయం" వ్యాఖ్యలపై తీవ్ర దుమారం



గుత్తి (తెలుగు కలం) అక్టోబర్ 17 : ప్రతినిధి : గుత్తి పట్టణంలో ఎన్నడూ లేనివిధంగా రాజకీయ ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. వైయస్సార్సీపీ నాయకుడు గంట నరహరి ప్రత్యర్థి వర్గాలను, కూటమి నాయకులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. "కడప రాజకీయం గుత్తిలో చూపిస్తాం" అని ఆయన అన్నట్లుగా ప్రచారం జరుగుతున్న వ్యాఖ్యలు పట్టణంలో తీవ్ర అలజడి సృష్టించాయి. ప్రశాంతమైన వాతావరణానికి మారుపేరైన గుత్తిలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని స్థానికులు, కూటమి నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహా బెదిరింపు ధోరణులు, ప్రజలను భయాందోళనలకు గురిచేసే వైఖరి సరైనది కాదని వివిధ రాజకీయ పక్షాలతో పాటు స్థానిక ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఎల్లప్పుడూ ప్రశాంతంగా ఉండే వాతావరణాన్ని దెబ్బతీసేలా రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్రిక్తతలు పెంచడం సరికాదని, బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న నాయకులు ఆచితూచి మాట్లాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

టీడీపీ తొలి జాబితా 7 కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీల అభ్యర్థులు వీరే!



నగర, పురపాలికల్లో బరిలో దిగే అభ్యర్థుల తొలి జాబితాను టీడీపీ ప్రకటించింది. బీసీలు, మహిళలు, యువతకు పెద్దపీట వేస్తూ జాబితా విడుదల చేసింది. నగర, పురపాలికల్లో టీడీపీ తరఫున బరిలో దిగే అభ్యర్థుల తొలి జాబితాను పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. బీసీలు, మహిళలు, యువతకు పెద్దపీట వేస్తూ ఏడు కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో మేయర్, ఛైర్‌పర్సన్ స్థానాలకు 36 మందిని ఖరారు చేశారు. మొత్తం అభ్యర్థుల్లో 22 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందినవారు కాగా, 19 మంది మహిళలకు అవకాశం కల్పించారు. ప్రజామోదం, విద్యార్హతలు, సేవా దృక్పథం, పార్టీ కోసం చేసిన కృషికి ప్రాధాన్యమిస్తూ అభ్యర్థుల ఎంపిక చేపట్టారు.కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో భాగంగా 11 కార్పొరేషన్లు, 78 మున్సిపాలిటీల్లో పోటీకి సిద్ధమైన టీడీపీ గెలుపు గుర్రాలతో తొలిజాబితా ప్రకటించింది. 7 కార్పొరేషన్లతో పాటు 26 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయతీలకు టీడీపీ అభ్యర్థుల జాబితా విడుదల చేసింది. విశాఖ మేయర్ అభ్యర్థిగా డాక్టర్ ముక్క శ్రావణి, విజయనగరం మేయర్ అభ్యర్థిగా అవనపు భార్గవి, నెల్లూరు మేయర్ అభ్యర్థిగా పోలబోయిన రూప్ కుమార్, తిరుపతి మేయర్ అభ్యర్థిగా మన్నెం శ్రీనివాస ప్రసాద్, చిత్తూరు కార్పొరేషన్‌కు కటారి హేమలత, కడపకు డాక్టర్ నెల్లటూరి సువర్ణ, కర్నూలు మేయర్ అభ్యర్థిగా విజయ ప్రత్యూషను టీడీపీ ఖరారు చేసింది. పార్టీ పట్ల విధేయతతో పనిచేసినవారికి ఎంపికలో ప్రాధాన్యమిచ్చారు. తిరుపతి మేయర్ అభ్యర్థి మన్నెం శ్రీనివాస ప్రసాద్ టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. విశాఖపట్నం, కర్నూలు మేయర్ అభ్యర్థులు గతంలో కార్పొరేటర్లుగా పనిచేశారు. పురపాలికలు, నగర పంచాయతీల్లో 29 మందితో జాబితా ప్రకటించారు. నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ మున్సిపాలిటీకి అనీషా షేక్, ఆత్మకూరు మున్సిపాలిటీకి డాక్టర్ గోవింద రాజులు, కర్నూలు జిల్లాలోని ఆదోని మున్సిపాలిటీకి నాగమణి పేర్లు ఖరారు చేశారు. కడప జిల్లా బద్వేలు మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా సోమశిల దివ్యతేజ, కమలాపురానికి గొంగలిరెడ్డి స్వప్న, పులివెందులకు తుగుట్ల గీతాకుమారి, జమ్మలమడుగుకు జ్యోతి చాడిపళ్ల, రాజంపేటకు డాక్టర్ దొంతం గాయత్రిని అభ్యర్థులుగా ప్రకటించారు.అన్నమయ్య జిల్లాలో మదనపల్లె మున్సిపాల్టీకి శ్రీరామ్ చిన్న బాబు, రాయచోటికి ఖాదర్ వలి షేక్‌ను ఎంపిక చేసింది. సత్యసాయి జిల్లాలో ధర్మవరం మున్సిపాలిటీ ఛైర్మన్ అభ్యర్థిగా పరిశె సుధాకర్, హిందూపురం పి.ఎన్. మంజునాథ్‌కు పెనుకొండలో త్రివేంద్ర మూర్తికి, అనంతపురం జిల్లా రాయదుర్గంలోటంకశాల హనుమంతుకు, సీటు ఖరారు చేసింది. ప్రకాశం జిల్లా అద్దంకి పురపాలిక అభ్యర్థిగా కాకాని అశోక్, మార్కాపురం మున్సిపాల్టీ ఛైర్మన్ అభ్యర్థిగా వక్కలగడ్డ మల్లికార్జున పేర్లు ప్రకటించింది. పల్నాడు జిల్లాలో దాచేపల్లికి తంగెళ్ల శ్రీనివాసరావు, గురజాలకు నెలవల్లి బొల్లయ్య, మాచర్లకు ఏనుముల సుష్మకు అభ్యర్థిత్వం ఖరారు చేశారు.చిత్తూరు జిల్లాలో కుప్పం మున్సిపాలిటీ ఛైర్మన్ అభ్యర్థిగా ఎస్.రాజ్‌కుమార్, నగరికి నుంచి శ్రీనివాసన్‌ను బరిలో దింపబోతున్నారు. బొబ్బిలికి రాంబార్కి రేణుకా దేవి స్వప్న, ఇచ్ఛాపురానికి ఆసి లీలా రాణి, పలాస కాశీబుగ్గకు వజ్ర గంగాభవాని, పెద్దాపురానికి వత్సవాయి ఎల్.ఎస్.ఎన్. రాజు, రామచంద్రపురానికి మేడిశెట్టి శేషారావు పేర్లను ప్రకటించారు. రేపల్లెకు కె. అపర్ణ, సూళ్లూరుపేటకు పిట్టల సుహాసిని, జగ్గయ్యపేటకు నరేంద్రుల వినీతను ఎంపిక చేశారు.36 మందిలో 16 స్థానాలు బీసీలకు: అభ్యర్థుల ఎంపికలో సామాజిక వర్గాల వారీగా 36 మందిలో 16 స్థానాలను బీసీలకు ఇచ్చారు. 7 కార్పొరేషన్లలో 4 మేయర్ స్థానాలు బీసీలకు, ఒకటి ఎస్సీకి దక్కాయి. విశాఖపట్నం, విజయనగరం కార్పొరేషన్లలో జనరల్ మహిళలకు రిజర్వు చేసిన స్థానాల్లోనూ బీసీ మహిళలనే ఎంపిక చేశారు. ఆళ్లగడ్డ, రాయచోటిలో మైనారిటీ అభ్యర్థులకు అవకాశం కల్పించారు. మొత్తం జాబితాలో ముగ్గురు ఎస్సీలు, ఒక ఎస్టీ అభ్యర్థి ఉన్నారు.బరిలో ముగ్గురు వైద్యులు: మహిళలకు రిజర్వు చేసిన 17 స్థానాలకు మించి మరో 2 చోట్ల టీడీపీ అవకాశం ఇచ్చింది. మహిళలకు ప్రత్యేకంగా రిజర్వు కాని చిత్తూరు కార్పొరేషన్, బద్వేలు మున్సిపాలిటీల్లోనూ మహిళా అభ్యర్థులను ఖరారు చేసింది. మొత్తం 36 మంది అభ్యర్థుల్లో 19 మంది మహిళలు ఉండగా ఐదుగురు మేయర్ అభ్యర్థులుగా ఉన్నారు. విద్యార్హతల పరంగా 25 మంది డిగ్రీ లేదా అంతకంటే ఉన్నత విద్య చదివినవారు ఉన్నారు. 3 వైద్యులు కూడా బరిలో నిలిచారు. యువతకు ప్రాధాన్యమిస్తూ 45 ఏళ్లలోపు 16 మందిని, 40 ఏళ్లలోపు 10 మందిని ఎంపిక చేశారు. రాజంపేట అభ్యర్థి డాక్టర్ దొంతం గాయత్రి 26 ఏళ్లతో అత్యంత పిన్నవయస్కురాలిగా నిలిచారు. విజయనగరం అభ్యర్థి భార్గవి వయసు 31 ఏళ్లు కాగా విశాఖ అభ్యర్థి డాక్టర్ ముక్క శ్రావణి వయసు 32 ఏళ్లు. మిగిలిన స్థానాలపై టీడీపీలో ఉత్కంఠ కొనసాగుతోంది. గుంటూరు, ఒంగోలు, మచిలీపట్నం కార్పొరేషన్ల మేయర్ అభ్యర్థులను ఇంకా ప్రకటించాల్సి ఉంది. నామినేషన్ల దాఖలుకు గడువు ముగుస్తుండటంతో మిగిలిన స్థానాల్లో జాబితా కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు.

మొక్కజొన్న మాటున గంజాయి రెండున్నరేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా సాగు



నెల్లూరు జిల్లాలో పొలం కౌలుకు తీసుకుని రెండున్నరేళ్లుగా మూడో కంటికి తెలియకుండా గంజాయి మొక్కలను పండిస్తున్నారు. డ్రోన్ సాయంతో పోలీసులు గుర్తించి దహనం చేశారు. కౌలుకు తీసుకున్న పొలంలో రెండున్నరేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా సాగు చేస్తున్న గంజాయి పంటను పోలీసులు గుర్తించారు. చుట్టూ మొక్కజొన్న సాగు చేస్తూ, మధ్యలో రెండెకరాలకుపైగా విస్తీర్ణంలో గంజాయి పెంచుతున్న వైనం వెలుగులోకి వచ్చింది. డ్రోన్ సాయంతో పంటను గుర్తించిన పోలీసులు శుక్రవారం దహనం చేశారు. ఈ వ్యవహారంలో ఆరుగురిని అరెస్టు చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.డ్రోన్ సాయంతో గుర్తింపు: దుత్తలూరు పోలీసుస్టేషన్ పరిధిలోని దుత్తలూరు-నందిపాడు మార్గంలో జాతీయ రహదారి 565 సమీపంలోని ఇటుక బట్టీల వద్ద అటవీ ప్రాంతానికి ఆనుకుని ఈ సాగు జరుగుతోంది. ఈ పొలం గ్రామానికి దూరంగా ఉండటంతో ఇన్నాళ్లూ ఈ వ్యవహారం బయటపడలేదు. గంజాయి సాగుపై గుర్తుతెలియని వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గురువారం సాయంత్రం డ్రోన్ సాయంతో తనిఖీలు నిర్వహించి గంజాయి మొక్కలను గుర్తించారు. అనంతరం పొలం వద్ద ఉన్న కొందరిని అదుపులోకి తీసుకున్నారు.1,731 గంజాయి మొక్కలు: రెండున్నరేళ్లుగా సాగుచేసి అమ్ముతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. సుమారు 1,731 గంజాయి మొక్కలను డ్రిప్ విధానంలో నీరు పెడుతున్నట్లు తెలుసుకున్నారు. పంట చేతికొస్తే సుమారు రూ.కోటి ఆదాయం వస్తుందని నిందితులు పేర్కొన్నట్లు పోలీసులు చెప్పారు. శుక్రవారం ఉదయం ఎస్పీ అజిత వేజెండ్ల ఆధ్వర్యంలో గంజాయి మొక్కలకు నిప్పు పెట్టి కాల్చివేశారు.అప్పుల నుంచి బయటపడేందుకు: ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు దుత్తలూరుకు చెందిన ఉప్పలపాటి సుబ్బారెడ్డి కొన్నేళ్ల క్రితం ఇతరుల వద్ద భూమిని కౌలుకు తీసుకున్నారు. తొలుత ఇతర పంటలు సాగు చేసిన అతను, ఆ తర్వాత గంజాయి సాగు ప్రారంభించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పంట వద్దకు ఎవరూ వెళ్లకుండా ఇద్దరిని కాపలాగా ఉంచినట్లు తెలిసింది. డ్రైవర్‌గా, కాంట్రాక్టర్‌గా, వ్యాపారిగా పనిచేసిన ఉప్పలపాటి సుబ్బారెడ్డి అప్పుల్లో కూరుకుపోవడంతో గంజాయి సాగు, రవాణా వైపు మళ్లినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.అల్లూరి జిల్లా నుంచి గంజాయి విత్తనాలు తీసుకొచ్చి సాగు చేసినట్లు నిందితుడు పోలీసుల విచారణలో ఒప్పుకున్నారు. దీనికి గుంటూరు జిల్లాకు చెందిన పవన్‌రెడ్డి ఆర్థిక సాయం అందించగా, చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన శ్రీకాంత్ గంజాయి కొనుగోలు చేసేందుకు ముందస్తుగా రూ.50 వేలు ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది.ముగ్గురు ఒడిశా వాసులు పరారీ: ఈ వ్యవహారంలో మొత్తం 9 మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో ఆరుగురిని అరెస్టు చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్నవారు ఒడిశా రాష్ట్రానికి చెందినవారని పోలీసులు తెలిపారు. మిగతా ఆరుగురు దుత్తలూరుకు చెందినవారే. గంజాయి సాగు వెనుక ఎవరున్నారనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

అడుగంటుతున్న భూగర్భజలాలు విడిచిపెట్టే ప్రతి బొట్టూ హెచ్చరికే



హైదరాబాద్‌లో ఒక్క రోజు 20% నీటిని పొదుపుతో 30.28 కోట్ల లీటర్ల మిగులుతోందని అధికారులు అంటున్నారు. ఇదే మాదిరి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచిస్తున్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా తక్కువగా వర్షపాతం నమోదైంది. దీంతో రాష్ట్రంలోని భూగర్భజలాలు రోజు రోజుకూ అడుగంటుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగర ప్రాంతంలో సుమారు 14.5 లక్షల నల్లా కనెక్షన్లు ఉన్నాయి. వీటి ద్వారా రోజూ 1.30 కోట్ల మందికి 560 ఎంజీడీ నీటిని సరఫరా చేస్తున్నారు. వీటిలో కనీసం 20 శాతం నీటిని ఆదా చేస్తే, 30.28 కోట్ల లీటర్ల నీరు మిగులుతుందని గ్రేటర్ అధికారులు? అంచనా వేశారు. ఇదే నీటిని 15 లక్షల జనాభా ఉన్న నల్గొండ వంటి పెద్ద జిల్లాకు, రోజుకు ఒక వ్యక్తికి 160 లీటర్ల చొప్పున రోజంతా ఇవ్వవచ్చని చెప్పారు.

ప్రతి ఒక్కరూ ఆచరిస్తే ఎంతో మేలు

కేవలం హైదరాబాద్ లో నీటి పొదుపును అచరిస్తేనే ఇంత మార్పు వస్తే, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ దీనిని ఆచరిస్తే ఇంకెంత మార్పు వస్తుందోనని నిపుణులు అంటున్నారు. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో భూగర్భ జలాలు తగ్గిపోవడం, జలాశయాలు ఎండిపోవడంతో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే బోరుబావులు ఎండిపోవడం ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరి ముందున్న ఏకైక కర్తవ్యం నీటిని ఆదా చేయడమేనని చెబుతున్నారు. రాష్ట్రంలో వర్షాలు లేకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు, అధిక వినియోగం కారణంగా భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటిపోతున్నాయి. ఈ సమయంలో నీటిని చాలా జాగ్రత్తగా వినియోగించుకోవాలని ప్రభుత్వం కోరుతోంది.

అధిక జనాభా జిల్లాలలో ఆందోళనకర పరిస్థితులు

రాష్ట్రంలోని 271 మండలాల్లో భూగర్భ జలమట్టం ప్రమాదకర స్థాయికి పడిపోయిందని భూగర్భ జలవనరుల శాఖ నివేదికలు పేర్కొంటున్నాయి. వీటిలో 117 మండలాల్లో పరిస్థితి తీవ్రంగా ఉందని చెబుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, భద్రాద్రి-కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, ఆదిలాబాద్, హనుమకొండ, యాదాద్రి-భువనగిరి, వికారాబాద్, నారాయణపేట, ఖమ్మం, సంగారెడ్డి, సూర్యాపేట, జోగులాంబ-గద్వాల, మహబూబాబాద్, మెదక్, వరంగల్, నిర్మల్, కామారెడ్డి, తదితర జిల్లాల్లోని 271 మండలాల్లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి.“భూగర్భ జలాలు అడుగంటిపోవడం వల్ల సాగు, తాగునీటి సమస్యలు మొదలయ్యాయి. వచ్చే వర్షాకాలం వరకు ఈ నీటి కొరత తప్పదు. ప్రతిఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలన్న సీఎం రేవంత్ రెడ్డి సూచనలను పాటిద్దాం. చిన్న చిన్న ఆలోచనలతో మనం నీటి వృథాను నివారించవచ్చు. ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ప్రభుత్వం కూడా అవగాహన కార్యక్రమాలను చేపడుతోంది” - కె.రామకృష్ణ రావు, ఎల్‌నినో రాష్ట్ర నోడల్ అధికారి, ప్రభుత్వ సలహాదారు

మనసు పెడితే మార్గాలెన్నో

ఇళ్లలో రోజువారీ నీటి వినియోగ విధానాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలి. వీటిని అనుసరించి ఎంత ఆదా చేయగలమో ఆలోచిస్తే, పొదుపు దానంతట అదే మొదలవుతుంది. వంటసామాగ్రిని శుభ్రపరిచే పద్ధతి, నల్లా లీకేజీలు, వాషింగ్ మెషీన్, షవర్లు, వాష్‌బేసిన్‌ల వద్ద నీటి వినియోగం వంటి విషయాలను గమనించాలి.మొక్కలకు పైపుల ద్వారా నీటిని సరఫరా చేస్తే ఎక్కువ మొత్తంలో నీరు వృథా అవుతుంది. దీనికి బదులుగా మొక్కలు, చెట్ల వేర్లకు నేరుగా నీటిని అందించే చర్య అత్యంత ప్రయోజనకరంగా ఉంటుంది.వాహనాలను కడగడం, నేలను శుభ్రపరచడం వంటి పనుల్లో అవసరమైన దానికంటే ఎక్కువ నీటిని వృథా అవుతుంది.దుస్తులు ఉతికే సందర్భంలో నీటిని నేరుగా పైపుల ద్వారా కాకుండా బకెట్ల ద్వారా ఉపయోగించడం మంచిది.ప్రతి ఇంట్లో ఒక ఇంకుడు గుంతను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. అపార్ట్‌మెంట్లు , గేటెడ్ కమ్యూనిటీలు తమ పరిధిలో వినియోగించే నీటిని వాటిలోనే ఇంకేలా చర్యలు తీసుకోవాలి.తాగునీటి ఫిల్టర్లు ఒక లీటరు స్వచ్ఛమైన నీటి కోసం రెండున్నర లీటర్ల నీటిని శుద్ధి చేస్తాయి. అంటే ఒకటిన్నర లీటర్ల నీరు వృథా అవుతుంది. ఆర్‌వో ఫిల్టర్ కేంద్రాలు, బల్క్‌గా నీటిని శుద్ధి చేసే కేంద్రాల్లో నీటి పొదుపును పాటించాలి. శుద్ధి చేసిన తర్వాత విడుదలయ్యే నీటిని ఇంకుడు గుంతల్లోనే సక్రమంగా ఇంకేలా చర్యలు తీసుకోవాలి.

దసరాకు ఊరెళ్లే వారికి ఆర్టీసీ షాక్ ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు ఛార్జీలు



బతుకమ్మ, దసరా పండగల రద్దీని ఆర్టీసీ ప్రత్యేక ఆదాయ అవకాశంగా మలుచుకుంటోంది. హైదరాబాద్ నగరంలో తక్కువ దూరాల్లో తిరిగే సిటీ బస్సులను సైతం సుదూర ప్రాంతాలకు మళ్లించి స్పెషల్ సర్వీసులను నడుపుతోంది. రెగ్యులర్ సర్వీసులను స్పెషల్ సర్వీసులుగా మార్చి సాధారణ ఛార్జీల కంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తుండటంతో ప్రయాణికులపై భారం పడుతోంది. ఇలా ఉండగా మరోవైపు పండుగల రద్దీతో రెగ్యులర్ బస్సులతోపాటు ప్రత్యేక సర్వీసులకు భారీ గిరాకీ ఉంది.హైదరాబాద్ నుంచి వరంగల్, సూర్యాపేట, మిర్యాలగూడ, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నారాయణఖేడ్, సత్తుపల్లి, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్టాండ్‌లు రద్దీగా మారాయి. ఆదివారం సద్దుల బత్తుకమ్మ పండగ ఉండటంతో హైదరాబాద్, ఇతర నగరాలు, పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు శుక్రవారం ప్రయాణీకులు పయనం అయ్యారు.

అదనంగా 50 శాతం ఛార్జీలతో ప్రత్యేక బస్సులు

హైదరాబాద్‌లో తక్కువ దూరాలు తిరిగేందుకు అనువుగా ఉండే మెట్రో డీలక్స్ బస్సులకు సైతం పండగ ప్రత్యేక సర్వీసులుగా వినియోగిస్తున్నారు. 50 శాతం అదనపు ఛార్జీలతో జేబీఎస్ నుంచి మంచిర్యాల, గోదావరిఖని వంటి ప్రాంతాలకు ఇలాంటి బస్సులను నడుపుతున్నారు. జేబీఎస్-మంచిర్యాలకు 91266 నంబరుతో ప్రత్యేక సర్వీసుగా నడిపారు. హైదరాబాద్ నుంచి గోదావరిఖనికి 91287, 91255 నంబర్లతో మెట్రో డీలక్స్ బస్సులను నడిపారు.

కరీంనగర్‌కి భారీ డిమాండ్

జేబీఎస్ నుంచి మంచిర్యాలకు శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు 31 బస్సులు వెళ్లగా అందులో 26 సర్వీసుల్లో 50 శాతం అదనపు ఛార్జీలున్నాయి. అక్టోబరు 17న ఉన్న మొత్తం 56 సర్వీసుల్లో 37 ప్రత్యేక సర్వీసులే నడుపుతున్నారు. అంటే మొత్తం సర్వీసుల్లో సగానికిపైగా బస్సుల్లో ప్రయాణికులు అధిక ఛార్జీలతో సొంతూళ్లకు చేరాల్సిన పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు రద్దీ భారీగా ఉంది. సాధారణ బస్సులతో పాటు ప్రత్యేక సర్వీసుల్లోనూ 80 శాతానికిపైగా రిజర్వేషన్ చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి సత్తుపల్లికి శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రివరకు నడిచిన 30 బస్సుల్లో 20 ప్రత్యేక సర్వీసులే ఉన్నాయి. 17న మొత్తం 38 సర్వీసులు నడపాలని నిర్ణయించగా అందులో 24 ప్రత్యేక బస్సులే ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఖమ్మం మార్గంలోనూ ప్రయాణికుల రద్దీ ఎక్కువుంది. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రివరకు 44 బస్సులు నడిస్తే వాటిలో 24 ప్రత్యేక సర్వీసులే. 17న నడిపే 134 బస్సుల్లో 55 ప్రత్యేక సర్వీసులున్నాయి. వరంగల్ మార్గంలో రద్దీ అధికంగా ఉంది.

పులివెందులలో నామినేషన్ వేసిన వైఎస్ ప్రమీల

పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి వైఎస్ ప్రమీల నామినేషన్

వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన మాజీ సీఎం జగన్ చిన్నమ్మ

టీడీపీ కూటమి తరపున తుగుట్ల గీతా కుమారి పోటీ



పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియ నిన్న ఉత్సాహంగా ప్రారంభమైంది. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి వైసీపీ అభ్యర్థిగా వైఎస్ ప్రమీల తన నామినేషన్ దాఖలు చేశారు. ఈమె వైసీపీ అధినేత జగన్ కు చిన్నమ్మ, మాజీ మున్సిపల్ వైస్-చైర్మన్ వైఎస్ మనోహర్ రెడ్డికి భార్య.పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో ఆమె తన పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఆమెతో పాటు తొలిరోజు వివిధ వార్డులకు పలువురు వైసీపీ అభ్యర్థులు కూడా నామినేషన్లు వేశారు.వైఎస్ కుటుంబానికి కంచుకోటగా ఉన్న పులివెందులలో ఈ ఎన్నికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈసారి చైర్‌పర్సన్ పదవిని మహిళా (జనరల్) కేటగిరీకి రిజర్వ్ చేశారు. ప్రమీల గతంలో కూడా పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. ఆమెపై టీడీపీ కూటమి అభ్యర్థిగా తుగుట్ల గీతా కుమారి పోటీ చేస్తున్నారు.నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థితో పాటు ఇద్దరిని మాత్రమే లోపలికి అనుమతించారు. దీంతో కార్యాలయం వెలుపల పెద్ద సంఖ్యలో గుమిగూడిన వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సందడి వాతావరణం కనిపించింది.

బెజవాడలో దసరా సందడి.. మహాలక్ష్మి అలంకారంలో కనకదుర్గ

ఇంద్రకీలాద్రికి భారీగా తరలివస్తున్న భక్తులు

అమ్మవారి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం

ఈ సాయంత్రం దుర్గమ్మను దర్శించుకోనున్న మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్



విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన శనివారం కనకదుర్గమ్మ వారు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఇంద్రకీలాద్రి జనసంద్రమైంది.తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తడంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రస్తుతం అమ్మవారి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పడుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు సహా ఇతర కనీస సౌకర్యాలను కల్పిస్తున్నారు.ఈ సాయంత్రం మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ ఇంద్రకీలాద్రిని సందర్శించనున్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. ఆ తర్వాత పున్నమి ఘాట్‌లో నిర్వహించనున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0' కార్యక్రమంలో ఆయన హాజరుకానున్నారు. దసరా ఉత్సవాల వేళ ఇంద్రకీలాద్రి పరిసరాల్లో ఆధ్యాత్మికతతో కూడిన పండుగ వాతావరణం సంతరించుకుంది.

మిథున్ రెడ్డి కాన్వాయ్‌లో రౌడీషీటర్లు ఉన్నారు: పుంగనూరు ఘటనపై డీఐజీ సంచలన వ్యాఖ్యలు

పుంగనూరులో మిథున్ రెడ్డి కాన్వాయ్‌పై దాడి

నామినేషన్ కేంద్రం గేట్లను ఢీకొని లోపలకు వచ్చారన్న డీఐజీ

13 మంది టీడీపీ కార్యకర్తలు గాయపడ్డారని వెల్లడి



స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల తొలిరోజే పుంగనూరులో చెలరేగిన హింసకు సంబంధించి కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కీలక విషయాలు వెల్లడించారు. రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి కాన్వాయ్‌లోని వాహనాల్లో పలువురు రౌడీషీటర్లు ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.పుంగనూరు, రాయచోటిలో మీడియాతో మాట్లాడిన డీఐజీ, ఘటన వివరాలను తెలిపారు. "ఉదయం 9 గంటలకు ఎంపీ కాన్వాయ్ వచ్చింది. టీడీపీ కార్యకర్తలు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల హెచ్చరికలను సైతం పట్టించుకోకుండా నామినేషన్ కేంద్రం గేట్లను ఢీకొట్టి బలవంతంగా లోపలికి ప్రవేశించారు. ఈ క్రమంలోనే రాళ్ల దాడి, ఘర్షణలు జరిగాయి" అని వివరించారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు డీఎస్పీ ప్రసాద్ గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరపాల్సి వచ్చిందని పేర్కొన్నారు.కాన్వాయ్‌లోని వాహనాల్లో ఉన్న కె. సాయికుమార్ రెడ్డి, కె. జస్వంత్, షేక్ ఇస్మాయిల్, పుట్ట వంశీకృష్ణ వంటి రౌడీషీటర్లు మారణాయుధాలతో దాడి చేశారని డీఐజీ తెలిపారు. రాళ్లదాడి, ఘర్షణలు జరగడంతో పోలీసులు ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో డీఎస్పీ ప్రసాద్ గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు చేశారు. ఎస్పీ ధీరజ్ మిథున్ రెడ్డిని వాహనంలో ఎక్కించుకుని సురక్షితంగా పుంగనూరు పట్టణం దాటించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో కారు ఢీకొట్టడంతో కిందపడి గాయపడిన సొహైల్ బాషా, మధు రాయల్, పెద్ద మోహన్ నాయుడు, డీఎస్పీ ప్రసాద్ తదితరుల ఫిర్యాదుతో మూడు కేసులు నమోదు చేశామని తెలిపారు. మొత్తం 13 మంది తెదేపా కార్యకర్తలు గాయపడ్డారని వెల్లడించారు.

అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్మి అయినా చెల్లింపులు పూర్తి చేస్తాం: పొన్నం ప్రభాకర్

రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలు త్వరలో చెల్లిస్తామని మంత్రి పొన్నం హామీ

అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్మి అయినా చెల్లింపులు పూర్తి చేస్తామని వెల్లడి

నీసీఎన్ బకాయిల పరిష్కారానికి కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడి



తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక భరోసా ఇచ్చారు. వారి పెండింగ్ బకాయిలను వీలైనంత త్వరగా చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ చెల్లింపుల కోసం అవసరమైతే విలువైన ఆర్టీసీ భూములను విక్రయించేందుకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.ఇటీవల జరిగిన ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో గెలుపొందిన యునైటెడ్ ఫ్రంట్ నేతలతో పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన ఆయన... రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న బకాయిల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్) బకాయిలతో పాటు, ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇతర పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పొన్నం ప్రభాకర్ వివరించారు. దీర్ఘకాలంగా పేరుకుపోయిన రిటైర్మెంట్ ప్రయోజనాలను చెల్లించడానికి భూముల అమ్మకం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని

బెల్లంముక్కతో ఎన్నో సమస్యలు దూరం

వీటితో కలిపి తింటే సూపర్ బెనిఫిట్స్!

బీపీ, రక్తహీనత, అజీర్తి నెలసరి సమస్యలకు చెక్

విటమిన్లతో పాటు అనేక ఖనిజాలు పుష్కలం!



జీర్ణ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారా? అయితే బెల్లం తినాల్సిందే! మలబద్ధకం సమస్య వేధిస్తోందా? దానికీ బెల్లమే పరిష్కారం! నెలసరి నొప్పులతో బాధపడుతున్నారా? బెల్లం ఉందిగా! ఇలా చెప్పుకుంటూ పోతే బెల్లం తింటే నయం కాని అనారోగ్యమంటూ ఉండదంటే అది అతిశయోక్తి కాదని నిపుణులు చెబుతుంటారు. అయితే ఈ బెల్లాన్ని నేరుగా కంటే కొన్ని పదార్థాలతో కలిపి తీసుకుంటే దాని సుగుణాలు రెట్టింపు అవుతాయంటున్నారు. ఫలితంగా ఆయా ఆరోగ్య సమస్యల్ని తగ్గించడంలో బెల్లం మరింత ప్రభావవంతంగా పని చేస్తుందని వెల్లడిస్తున్నారు. అజీర్తి దగ్గర నుంచి ఆకలిని అదుపు చేసే దాకా, నెలసరి సమస్యల్ని తగ్గించడం నుంచి చనుబాలు ఉత్పత్తి చేసే దాకా ఇలా ప్రతి ఒక్కటీ బెల్లంతో ముడిపడి ఉంటుందని వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బెల్లాన్ని ఏయే పదార్థాలతో కలిపి తీసుకుంటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయో ఇప్పుడు తెలుసుకుందాం.బెల్లంలో క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఎన్నో ఖనిజాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇంకా బి-కాంప్లెక్స్, సి, డి 2, ఇ వంటి విటమిన్లు నిండి ఉన్న బెల్లాన్ని తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయని వెల్లడిస్తున్నారు. దీని వల్ల బీపీని అదుపు చేయడం, శరీరానికి తక్షణ శక్తిని అందించడం, నెలసరి నొప్పుల నుంచి ఉపశమనం కలిగించడం, రక్తహీనతను తగ్గుతుందని వివరిస్తున్నారు.

బెల్లం నెయ్యి

ఈ రెండూ కలిపి తీసుకుంటే మలబద్ధకం సమస్య నుంచి విముక్తి పొందచ్చు. బెల్లంధని యాలు: ఇలా తీసుకుంటే నెలసరి సమయంలో అధిక రక్తస్రావం, నొప్పుల నుంచి విముక్తి పొందచ్చు. ఇంకా స్పాటింగ్ మాత్రమే అవుతోందని బాధపడే వారికి ఆ సమస్య తగ్గి ఎప్పటిలాగే పిరియడ్స్ ప్రారంభమవుతాయట.

బెల్లం సోంపు

ఇది నోటి దుర్వాసనను దూరం చేస్తుంది. అంతేకాకుండా దంతాలపై పాచి పేరుకుపోకుండా చూసుకోవచ్చు.

బెల్లం మెంతులు

ఇలా రెండు కలిపి తీసుకుంటే జుట్టు ఆరోగ్యం రెట్టింపు అవుతుంది. కుదుళ్లు దృఢంగా మారడమే కాకుండా.. తెల్ల జుట్టు రాకుండా జాగ్రత్తపడచ్చు.

బెల్లం గోంద్

ఎముకల్ని దృఢంగా చేయడానికి ఈ ఫుడ్ కాంబినేషన్ చక్కగా ఉపకరిస్తుందని నిపుణులు అంటున్నార. అలాగే పాలిచ్చే తల్లులు తీసుకుంటే చనుబాలు పుష్కలంగా ఉత్పత్తి అవుతాయని తెలిపారు.

బెల్లం అలీవ్ గింజలు

మనం తీసుకునే ఆహారంలోని ఫోలికామ్లం, ఐరన్‌ను శరీరం త్వరగా గ్రహించేందుకు ఈ ఫుడ్ కాంబినేషన్ తోడ్పడుతుందని తెలిపారు. ఇక చర్మంపై ఏర్పడిన పిగ్మెంటేషన్‌ని తగ్గించడంతో పాటు జుట్టు పెరుగుదలకూ దోహదం చేస్తుందని వివరించారు.

బెల్లం నువ్వులు

ఈ రెండింటిని కలిపి తినడం వల్ల దగ్గు, జలుబు, ఫ్లూ వంటివి దరిచేరకుండా కాపాడుతుంది.

బెల్లంంపల్లీలు

శరీరంలో సత్తువను పెంచడానికి, ఆకలిని అదుపు చేయడానికి, ఆహారపు కోరికల్ని తగ్గించడానికి ఈ ఫుడ్ కాంబినేషన్ అద్భుతంగా పని చేస్తుందని నిపుణులు అంటున్నారు.

బెల్లంంపసుపు: ఈ రెండూ కలిపి తీసుకుంటే రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చని చెబుతున్నారు.

బెల్లంంశొంఠి పొడి: వీటిని కలిపి తినడం వల్ల జ్వరం నుంచి త్వరగా కోలుకోవచ్చు. ఇంకా శరీరంలోని వాపును తగ్గించడానికి ఇది దోహదం చేస్తుంది.

'ఇవి తింటే యూరిక్ యాసిడ్ తగ్గిపోతుంది'

బెస్ట్ రిజల్స్ కోసం ఎప్పుడు తినాలి ?

ఈ 6 పదార్థాలు తీసుకుంటే యూరిక్ యాసిడ్ తగ్గతుందట!

ఎలా తీసుకుంటే మంచి లాభాలు ఉంటాయో తెలుసా ?

ఈ మధ్య కాలంలో చాలా మంది యూరిక్ యాసిడ్ సమస్యతో బాధపడుతున్నారు. శరీరంలో యూరిక్ యాసిడ్ లెవల్స్ పెరగడం వల్ల నొప్పితో పాటు గౌట్, కిడ్నీలో రాళ్లు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో అనేక మందులతో పాటు ఆహార నియమాలు పాటిస్తుంటారు. అయితే కొన్ని డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం వల్ల ఈ సమస్య నుంచి తప్పించుకోవచ్చని సూచిస్తున్నారు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్?ఫ్లమేటరీ గుణాలు.. యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గేలా చేస్తాయని వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అవేంటి వాటిని ఎప్పుడు, ఎలా తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.యూరిక్ యాసిడ్ఎలా ఏర్పడుతుంది.మనం రోజూ తీసుకునే ఆహారంలోని ప్రొటీన్ల నుంచి ప్యూరిన్ అనే రసాయనం విచ్ఛిన్నం చెంది యూరిక్ యాసిడ్‌గా ఏర్పడుతుంది. ఇలా ఏర్పడిన యూరిక్ యాసిడ్ ఎప్పటికప్పుడూ మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతుంది. కానీ కొన్ని సందర్భాల్లో యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉత్పత్తి కాగా, అంతే స్థాయిలో మూత్రం ద్వారా సరిగ్గా బయటకు వెళ్లనప్పుడు సమస్య వస్తుంది. యూరిక్ యాసిడ్ విసర్జన సరిగ్గా జరగక అది రక్తంలోని నిలిచిపోతుంది. అలా నిలిచిపోయిన యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా మారి కీళ్లు, కీళ్ల చుట్టూ ఉండే కణజాలాల్లో పేరుకుపోయి హైపర్? యూరిసిమియాకు దారి తీస్తుంది.



వాల్ నట్స్ : ఇందులో పుష్కలంగా ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ వాపు, నొప్పిని తగ్గించడంలో బాగా ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంకా యూరిక్ యాసిడ్‌ను తొలగించి కిడ్నీ పనితీరును మెరుగపరచడంలోనూ సాయపడుతుందని వెల్లడిస్తున్నారు.2-3 వాల్ నట్స్‌ను ముందు రోజు రాత్రి నీటిలో నానబెట్టాలి. అనంతరం పరగడుపునే తినవచ్చని లేదా స్మూతీలు, సలాడ్?తో పాటు తీసుకోవాలని చెబుతున్నారు.

పిస్తా : పిస్తాల్లో పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు గుణాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. ఇవి యూరిక్ యాసిడ్, వాపు పెరిగేందుకు కారణమైన ఆక్సిడేటివ్ స్ట్రెస్‌తో పోరాడుతుందని వివరిస్తున్నారు. ఇంకా ఇందులోని ఆరోగ్యకరమైన పోషకాలు జీర్ణక్రియను మెరుగపరచడంలో సాయపడతాయని తెలిపారు.సుమారు 15 పిస్తాలను ఉదయాన్నే తినాలని చెబుతున్నారు. అయితే, వీటిని వేయించకుండా, ఎలాంటి ఉప్పు లేకుండా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఉప్పుతో తీసుకుంటే కిడ్నీ పనితీరుపై చెడు ప్రభావం చూపిస్తుందని తెలిపారు.

బాదం : బాదంలో జీర్ణక్రియను పెంచే, యూరిక్ యాసిడ్ లెవల్స్‌ను అదుపులో పెట్టే మెగ్నీషియం పోషకాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇది శరీరంలోని యూరిక్ యాసిడ్‌ను బయటకు పంపడంతో పాటు కిడ్నీ పనితీరును పెంచుతుందని వివరిస్తున్నారు.5-6 బాదంను రాత్రి పూట నీటిలో నానబెట్టి ఉదయాన్నే వాటి పొట్టును తీసి ఖాళీ కడుపుతో తినాలని చెబుతున్నారు. అలా తినలేకపోతే మిక్సీ పట్టి పాలల్లో లేదా ఓట్ మీల్‌లో కలిపి తాగాలని అంటున్నారు.

జీడిపప్పు : మెగ్నీషియంతో పాటు హెల్దీ ఫ్యాట్ లభించే అద్భుతమైన పదార్థాల్లో జీడిపప్పు ఒకటి. ఇవి వాపును తగ్గించడంతో పాటు జీర్ణక్రియను పెంచడంలో సహాయ పడతాయని నిపుణులు వెల్లడిస్తున్నారు. ఇందులో ప్యూరిన్స్ తక్కువగా ఉండడం వల్ల యూరిక్ యాసిడ్ అదుపులో ఉంటుందని వివరిస్తున్నారు. ఉదయాన్నే 4-5 జీడిపప్పులను ఎలాంటి ఉప్పు లేకుండానే తినాలని చెబుతున్నారు. పీలైతే ఇతర నట్స్‌తో తీసుకుంటే సమతుల పోషకాలు అందుతాయని తెలిపారు.

డేట్స్ (ఖర్జూర) : ఇందులో ఫైబర్, పొటాషియం లాంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి రెండూ యూరిక్ యాసిడ్‌ను బయటకు పంపడంతో పాటు కిడ్నీ పనితీరును మెరుగుపరుస్తాయని అంటున్నారు. ఇంకా సహజంగానే శక్తిని పెంచేలా చేస్తుందని వివరిస్తున్నారు.ఉదయాన్నే 1-2 డేట్స్ నేరుగానే తినాలని లేదా స్మూతీలు, సలాడ్‌లో కలిపి తీసుకోవచ్చని చెబుతున్నారు.

బ్రెజిల్ నట్స్ : ఇందులో వాపును తగ్గించే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్న సెలీనియం పుష్కలంగా ఉంటుందని తెలిపారు. ఇంకా ఇది యూరిక్ యాసిడ్?ను బయటకు పంపి కిడ్నీలు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుందని వివరిస్తున్నారు.రోజూ 1-2 బ్రెజిల్ నట్స్ తినాలని.. అతిగా తింటే సెలీనియం శరీరానికి హానికరమని అంటున్నారు. ఉదయాన్నే నేరుగా లేకపోతే గ్రైండ్ చేసి తీసుకోవచ్చని చెబుతున్నారు.ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

షుగర్ పేషెంట్లు ఈ 6 పండ్లను అసలు తినకూడదట!



గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువుంటే షుగర్ లెవల్స్ పెరుగుతాయట!

ఇవి ఎక్కువగా ఉండే పండ్లు

ప్రతి రోజు పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతుంటారు. కానీ, మధుమేహంతో బాధపడే వారు మాత్రం పండ్లు తినాలంటే భయపడుతుంటారు. పండ్లలో చక్కెరస్థాయి ఎక్కువగా ఉంటుందని.. వాటిని తింటే రక్తంలో షుగర్ స్థాయిలు పెరుగుతాయని భయపడుతుంటారు. ముఖ్యంగా కొన్ని పండ్లను తీసుకుంటే మాత్రం చక్కెర స్థాయిలు పెరుగుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2002లో అనే అధ్యయనంలోనూ ఈ విషయం తేలింది. ఈ నేపథ్యంలోనే ఆ పండ్లు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

మనం రోజూ తీసుకునే ఆహారంలో ఉండే కార్బోహైడ్రేట్స్ వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు పెరుగుతుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇలా రక్తంలో చక్కెర స్థాయి ఎంత మేర పెరుగుతుందో తెలిపే కొలమానాన్నే గ్లైసెమిక్ ఇండెక్స్ అంటుంటారు. తీసుకునే ఆహారంలో చక్కెర స్థాయి 55కు మించకుండా ఉండే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ అని, 56-69 మధ్య ఉంటే మధ్యస్థ, 70కి మించి ఉంటే అధిక గ్లైసెమిక్ ఇండెక్స్‌గా విభజిస్తుంటారు. అయితే, మధుమేహం ఉన్నవారు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న పండ్లను తినాలని నిపుణులు సూచిస్తున్నారు. మధ్యస్థ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న పండ్లను తక్కువగా తింటే మంచిదని సలహా ఇస్తున్నారు. (రిపోర్ట్ కోసం ఇక్కడ క్లిక్ చేయండి)

పుచ్చకాయ : వేసవిలో వచ్చే పుచ్చకాయలో అనేక పోషకాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. కానీ ఇందులో 72-80 వరకు గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుందని.. ఫలితంగా ఎక్కువ షుగర్ స్థాయిలు ఉంటాయని తెలిపారు. అందుకే దీనిని వీలైనంత తక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

అరటి: సీజన్?తో సంబంధం లేకుండా ఉండే అరటిలో పండిన శాతం ఆధారంగా గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుందని వెల్లడిస్తున్నారు. అరటి కాయలో 42-62 వరకు ఉంటుందని.. పండిన తర్వాత ఇంకా ఎక్కువగానే ఉంటుందని వివరిస్తున్నారు. అందుకే వీటిని తక్కువగా తినాలని సూచిస్తున్నారు.

ఎనాపిల్: ఇందులో సహజసిద్ధమైన చక్కెరలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. ఫలితంగా ఇది తిన్న వెంటనే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయని వెల్లడిస్తున్నారు. అందుకే తక్కువ మోతాదులో తినాలని సూచిస్తున్నారు.

మామిడికాయ: వేసవిలో మాత్రమే లభించే మామిడికాయ అంటే చాలా మందికి ఎంతో ఇష్టం ఉంటుంది. దీంతో ఎక్కువగా తింటుంటారు. ఇందులో 51-60 గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుందని, ఫ్రక్టోజ్, సూక్రోజ్ శాతం సైతం అధికంగా ఉంటుందని చెబుతున్నారు. చక్కెర స్థాయిలు పెరగకుండా ఉండాలంటే దీనిని తక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

ద్రాక్ష: ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగానే ఉంటుందని.. కానీ చిన్నగా ఉండడం వల్ల ఎక్కువగా తీసుకుంటామని అంటున్నారు. ఫలితంగా చక్కెర స్థాయిలు పెరుగుతాయని చెబుతు న్నారు. అందుకే వీలైనంత తక్కువగా ద్రాక్షను తినాలని సూచిస్తున్నారు.

చెర్రీలు: చెర్రీల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ స్థాయిలు రకరకాలుగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. వీలైనంత తక్కువగా తినాలని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచ నలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

ఇవి తింటే స్ట్రోక్ వచ్చే ఛాన్స్ తక్కువట



మీకు 30 ఏళ్లు దాటాయా? అయితే మీరు తినే ఆహారంలో ఈ పదార్థాలు చేర్చుకుంటే మంచిదట! వీటిని మీ డైట్?లో జతచేసుకోవడం వల్ల స్ట్రోక్ వచ్చే అవకాశాలు తక్కువని నిపుణులు చెబుతున్నారు. మన జీర్ణవ్యవస్థకు మెదడు ఆరోగ్యానికి మధ్య సంబంధం ఉందని 18వ శతాబ్దంలోనే శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఈ నేపథ్యంలోనే వాటిపైన మరింత అధ్యయనం చేశారు. ఇందులో భాగంగా జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవులు, మంచి బ్యాక్టీరియా.. మెదడు ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో పరిశీలించారు. ఇందులో శరీరంలోని రెండు ప్రధాన భాగాలైన జీర్ణవాహిక, కేంద్ర నాడీ వ్యవస్థ మధ్య పరస్పర కమ్యూనికేషన్ జరిగినట్లు తేల్చారు. ప్రోబయాటిక్స్ గుణాలున్న ఆహారం తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండి మెదడును రక్షిస్తుందని వెల్లడించారు.మరోవైపు జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవులు, మంచి బ్యాక్టీరియా సంఖ్య పెరగడం వల్ల దీర్ఘకాలంలో స్ట్రోక్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు తేల్చారు. 2025లో అనే అధ్యయనంలో తేలింది. ఈ నేపథ్యంలోనే జీర్ణవ్యవస్థ, మెదడు మధ్య ఉన్న సంబంధంపై చైనాకు చెందిన ఫుడాన్ యూనివర్సిటీ పరిశోధకులు అధ్యయనం చేశారు. నేషనల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎగ్జామినేష్ సర్వేలోని డేటాను సేకరించి పరిశీలించారు. ఇందులో 20ఏళ్లు దాటిన వివిధ ప్రాంతాలు, వివిధ ఆహారపు అలవాట్లు ఉన్న 48,677 మంది వివరాలు సేకరించారు. వీరికి జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని పెంచే అవకాడోలు, బ్రకోలీ, కాఫీ, శనగలు, క్రాన్?బెర్రీలు, డెయిరీ పదార్థాలు, సోయా, తృణధాన్యాలు ఆధారంగా ఎక్కువ స్కోర్లు ఇచ్చారు. దీంతో పాటు ప్రాసెస్ చేసిన ఆహారం, మాంసం తీసుకున్నవారికి తక్కువ స్కోర్లు ఇచ్చి విభజించారు. ఇందులో 20-29 ఏళ్ల మధ్య ఉన్నవారిలో ఎలాంటి మార్పులను గమనించలేదని పరిశోధకులు వెల్లడించారు. అదే 30 ఏళ్ల దాటినవారిలో జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటే.. స్ట్రోక్ వచ్చే అవకాశం తగ్గినట్లు కనిపెట్టారు. ముఖ్యంగా ఆకుకూరలు, వివిధ రకాల పోషకాలు ఉన్న ఆహారం తినేవారిలో స్ట్రోక్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు, ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం తక్కువని తెలిపారు.మరోవైపు జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా లేకపోవడం వల్ల స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని 2022లో అధ్యయనంలో తేలింది. జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవుల సమతుల్యంగా లేకపోవడం వల్ల హైపర్ టెన్షన్, డయాబెటిస్, ఊబకాయం, జీర్ణక్రియ సమస్యలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇవన్నీ దీర్ఘకాలంలో స్ట్రోక్?కు దారితీసే ప్రమాదం ఉందని వివరించారు. అధిక రక్తపోటు, అధిక చక్కెర స్థాయిల, జీర్ణక్రియ సమస్యల వల్ల మెదడులో రక్తం గడ్డకట్టే అవకాశం ఉంటుందని వెల్లడించారు.

రోజూ ఇవి వాడితే కిడ్నీలు ఫెయిల్ అయ్యే ఛాన్స్

పెయిన్ కిల్లర్స్ అతిగా వాడడం వల్ల కిడ్నీ ఫెయిల్

కిడ్నీలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలివే



మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు ఒకటి. ఆహారం జీర్ణమయ్యే సమయంలో ఏర్పడే మలినాలు, శరీరంలో జరిగే జీవక్రియలో ఏర్పడే వ్యర్థ పదార్థాలను ఎప్పటికప్పుడూ తొలగించి ఆరోగ్యంగా ఉండేలా కిడ్నీలు సాయంచేస్తాయి. అయితే, ఇటీవల కాలంలో అనేక కారణాల వల్ల చాలా మంది కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. దీనికి కారణం సరైన ఆహారం తీసుకోకపోవడం, అధిక రక్తపోటు అని చాలా మంది అనుకుంటారు. కానీ, రోజూవారీ జీవితంలో ఉపయోగించే కొన్ని వస్తువుల వల్ల కూడా మన మూత్ర పిండాలు దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.ఫెయిర్ నెస్ క్రీములు: చాలా మంది ఉపయోగించే ఫెయిర్ నెస్ క్రీముల వల్ల కిడ్నీలు దెబ్బతింటాయని నిపుణులు అంటున్నారు. ఇందులో మెలనిన్ ఉత్పత్తిని అడ్డుకునేందుకు వాడే హానికారక మెర్క్యురీ అధికంగా ఉంటుందని.. దీనిని చర్మం గ్రహించడం వల్ల శరీరంలోకి చేరి కిడ్నీలు చెడిపోయే ప్రమాదం ఉందని వెల్లడించారు. దీర్ఘకాలం పాటు మెర్క్యురీతో కూడిన సౌందర్య ఉత్పత్తులను వాడడం వల్ల కిడ్నీ ఫెయిల్ అయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకోసమే ఇలాంటి ఉత్పత్తులు కొనేముందు అందులోని పదార్థాలను చూడాలని.. అవసరమైతే డెర్మటాలజిస్ట్‌ను సంప్రదించాలని సూచించారు.

హెర్బల్ సప్లిమెంట్లు : హెర్బల్ సప్లిమెంట్లను పార్మా మందులకు ప్రత్యామ్నాయంగా భావిస్తుంటారు చాలా మంది. అయితే, వీటిపై నేచురల్, హెర్బల్ అని పెట్టినా సరే.. సరిగ్గా పరీక్షించకపోవడం వల్ల కొన్ని ఉత్పత్తుల్లో హానికారక రసాయనాలు కలిపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఆర్సనిక్, లెడ్, మెర్క్యురీ వంటి విషపూరిత పదార్థాలను వాడడం వల్ల అవి శరీరంలో పేరుకుపోయి కిడ్నీలను దెబ్బతీస్తాయని తెలిపారు. అందుకే హెర్బల్ ఉత్పత్తులను వాడే ముందు డాక్టర్లను సంప్రదించాలని.. మంచి పేరున్న బ్రాండ్ ఉత్పత్తులను వాడాలని సూచిస్తున్నారు.

పెయిన్ కిల్లర్స్ : మనలో చాలా మంది తల, కండరాల నొప్పులు లేదా ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు నేరుగా షాపునకు వెళ్లి పెయిన్ కిల్లర్స్ తీసుకుంటారు. అయితే, ఈ మందులు స్వల్పకాలం నొప్పిని తగ్గించినా.. దీర్ఘకాలంలో అనేక ఇబ్బందులను తెస్తాయని నిపుణులు వెల్లడించారు. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని వివరిస్తున్నారు. వీటిని తరచూగా తీసుకోవడం వల్ల కిడ్నీలకు రక్త సరఫరాను తగ్గి ఫలితంగా కిడ్నీలు ఫెయిల్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

గ్రీన్ టీ : ప్రపంచంలోనే ఆరోగ్యకరమైన పానీయాల్లో గ్రీన్ టీకి ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు అంటుంటారు. కానీ, గ్రీన్ టీని ఎక్కువగా తాగడం వల్ల (రోజుకు అర లీటర్ కంటే ఎక్కువ) కిడ్నీలు ఫెయిల్ అవుతాయని మీకు తెలుసా? ఇందులో ఉండే ఆక్సలెట్స్.. క్యాల్షియంతో కలిసి కిడ్నీలో రాళ్లు ఏర్పడేలా చేస్తాయని వెల్లడించారు. అలా అని మొత్తంగా గ్రీన్ టీని మానేయాల్సిన అవసరం లేదని.. కానీ ఎక్కువ మోతాదులో తీసుకోకూడదని సూచిస్తున్నారు. మీకు ఇప్పటికే కిడ్నీలో రాళ్లు సమస్య ఉంటే తక్కువ మోతాదులో తాగాలని సలహా ఇస్తున్నారు.

ప్రొటీన్ సప్లిమెంట్లు : పోషకాహార లోపం ముఖ్యంగా జిమ్‌కు వెళ్లేవారు వ్యాయామంలో భాగంగా ప్రొటీన్ సప్లిమెంట్లను తీసుకుంటారు. కండరాలు పెరగడానికి చాలా మంది పౌడర్లు, షేక్స్ తీసుకుంటారు. అయితే, వీటిని అతిగా తీసుకోవడం వల్ల కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు అంటున్నారు. మనం తీసుకునే ప్రొటీన్లను ఫిల్టర్ చేసే బాధ్యత కిడ్నీలపై ఉంటుంది. ఈ క్రమంలోనే ప్రొటీన్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల వాటిని ఫిల్టర్ చేయలేక కిడ్నీపై ఒత్తిడి పెరిగి సమస్యలు వస్తాయని వివరించారు. అందుకే వీటిని మరీ ఎక్కువగా కాకుండా.. తగిన మోతాదులో తీసుకోవాలని అవసరమైతే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.హెయిర్ స్ట్రెయిటెనింగ్ ఉత్పత్తులు: కొంతమంది తరచూగా హెయిర్ స్ట్రెయిటెనింగ్ చేసుకుంటారు. ఇందుకోసం మార్కెట్లో దొరికే కొన్ని ఉత్పత్తులను వాడుతుంటారు. అయితే, ఇందులో ఉండే గ్లైయాక్లాలిక్ యాసిడ్ చర్మం ద్వారా శరీరంలోకి చేరి కిడ్నీలను దెబ్బ తీస్తాయని వెల్లడిస్తున్నారు.



'స్టార్‌లింక్'తో పోటీకి మేం సిద్ధమే

కానీ ఎవరైనా చట్టాలకు లోబడే పనిచేయాల్సిందే

రిలయన్స్ రియాక్షన్

స్టార్‌లింక్‌ను భారత్‌లోకి రాకుండా అడ్డుకుంటున్నారంటూ ఎలాన్ మస్క్ చేసిన ఆరోపణలపై రిలయన్స్ స్పందించింది శాటిలైట్ కమ్యూనికేషన్స్ రంగంలోకి వచ్చే దేశీయ, విదేశీ సంస్థలన్నింటినీ స్వాగతిస్తున్నట్లు తెలిపింది.



భారత్‌లోకి స్టార్ లింక్ సేవల ఎంట్రీపై చర్చలు జరుగుతున్న వేళ, ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ సంస్థ స్పందించింది. భారత శాటిలైట్ కమ్యూనికేషన్స్ రంగంలోకి ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సహా ఏ సంస్థ వచ్చినా స్వాగతిస్తామని స్పష్టం చేసింది. అయితే, ఆ రంగంలో పోటీ పడే ప్రతి సంస్థ భారత చట్టాలు, నిబంధనలు, విధానాలకు కట్టుబడి పనిచేయాల్సిందేనని తేల్చిచెప్పింది. స్టార్‌లింక్ భారత్‌లోకి రాకుండా ముకేశ్ అంబానీ అడ్డుకుంటున్నారంటూ మస్క్ ఆరోపించిన నేపథ్యంలో రిలయన్స్ తాజాగా ప్రకటన చేసింది.భారత్‌లో పెట్టుబడులు పెట్టే దేశీయ, విదేశీ సంస్థలన్నింటికీ ప్రభుత్వం ఒకే విధమైన ప్రక్రియను అమలు చేస్తోందని రిలయన్స్ తెలిపింది. ప్రభుత్వ విధానాలు, చట్టాలకు అనుగుణంగానే ప్రతి సంస్థకు అనుమతులు లభిస్తాయని పేర్కొంది. తమ సంస్థకు చెందిన జియో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు ఇప్పటి వరకు ఇంకా ప్రభుత్వ అనుమతులు రాలేదని గుర్తుచేసింది. ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ, శాటిలైట్ కమ్యూనికేషన్స్ రంగంలోకి వచ్చే ప్రతి సంస్థకు ఒకే నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది.పోటీ అంటే తాము ఎప్పుడూ భయపడలేదని, త్ను సిద్ధమని రిలయన్స్ పేర్కొంది. వినియోగదారులకు ఎవరు మెరుగైన సేవలు అందిస్తున్నారో తెలుసుకోవడానికి పోటీనే సరైన పరీక్ష అని అభిప్రాయపడింది. భారత ప్రజలకు మేలు చేసే పెట్టుబడులు, కొత్త ఆవిష్కరణలను దేశం ఎప్పుడూ స్వాగతిస్తోందని తెలిపింది. అటువంటి వాతావరణంలోనే రిలయన్స్ కూడా అభివృద్ధి చెందిందని వివరించింది. 2016లో జియో టెలికాం రంగంలోకి అడుగుపెట్టినప్పుడు అప్పటికే అనేక సంస్థలు పోటీలో ఉన్నాయని గుర్తుచేసింది.ఒక్క వినియోగదారుడు కూడా లేని సంస్థగా మార్కెట్లోకి వచ్చిన జియో, పదేళ్లలో 53 కోట్ల మందికి పైగా వినియోగదారుల నమ్మకాన్ని సంపాదించిందని రిలయన్స్ తెలిపింది. అందుబాటు ధరల్లో ఇంటర్నెట్ సేవలు అందించడంతోపాటు, ప్రపంచస్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాలను భారత ప్రజలకు చేరువ చేశామని పేర్కొంది. శాటిలైట్ కమ్యూనికేషన్స్ రంగంలో స్టార్‌లింక్‌తో సహా ఇతర సంస్థలు పోటీకి రావడాన్ని స్వాగతిస్తున్నామని మరోసారి స్పష్టం చేసింది. అయితే జియో అయినా, విదేశీ సంస్థ అయినా భారత ప్రజలకు సేవలు అందించేటప్పుడు దేశ చట్టాలు, విధానాలను తప్పనిసరిగా పాటించాలని వెల్లడించింది.స్టార్‌లింక్ భారత్‌లో వాణిజ్య సేవలను ప్రారంభించేందుకు ఎదుర్కొంటున్న అడ్డంకుల వెనుక ప్రయోజనాలు ఆశించే వర్గాలు ఉన్నాయంటూ స్పేస్‌ఎక్స్ అధినేత ఇటీవల ఎలాన్ మస్క్ ఆరోపించారు. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్‌ను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టులు పెట్టారు. భారత్‌లో అంబానీకి చెందిన సంస్థలు అందిస్తున్న తక్కువ ధరల ఇంటర్నెట్ సేవలతో స్టార్‌లింక్ పోటీ పడలేదని కొందరు చెబుతున్నారని, అదే సమయంలో స్టార్‌లింక్ వస్తే తీవ్ర పోటీ ఏర్పడుతుందని వాదిస్తున్నారని మస్క్ పేర్కొన్నారు. ఈ రెండు వాదనల మధ్య వైరుధ్యం ఉందని విమర్శించారు.శాటిలైట్ ఇంటర్నెట్ సేవల్లో పోటీ పెరిగితే భారత వినియోగదారులకు మరిన్ని ఎంపికలు అందుబాటులోకి వస్తాయని మస్క్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల ప్రస్తుతం మార్కెట్లో ఉన్న సంస్థల లాభాలు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, వాటి వ్యాపారాలు పూర్తిగా దెబ్బతింటాయని చెప్పలేమని పేర్కొన్నారు. గతంలోనూ భారత టెలికాం రంగంలో గుత్తాధిపత్య ధోరణులు ఉన్నాయంటూ మస్క్ విమర్శలు చేశారు. స్టార్‌లింక్ సేవలకు అనుమతుల విషయంలోనూ ప్రశ్నలు లేవనెత్తారు. ఈ నేపథ్యంలో రిలయన్స్ తాజా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, శాటిలైట్ కమ్యూనికేషన్స్ రంగంలో ఏ ఒక్క సంస్థ గుత్తాధిపత్యానికి అవకాశం లేదని ఇటీవల కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేశారు. వాణిజ్య సేవలకు అవసరమైన తుది అనుమతుల కోసం మూడు సంస్థల దరఖాస్తులు ప్రక్రియలో ఉన్నాయని తెలిపారు. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలకు సంబంధించిన ధరల విధానంపై కూడా ప్రభుత్వం తుది నిర్ణయానికి దగ్గరగా ఉందని పేర్కొన్నారు. స్టార్‌లింక్‌తో సహా అనుమతులు పొందిన సంస్థలు వాణిజ్య సేవలను ప్రారంభించే ముందు భద్రతాపరమైన నిబంధనలను తప్పనిసరిగా పూర్తి చేయాలని చెప్పారు.

చైనా తర్వాత అతిపెద్ద 5జీ బేస్ మనదే

డేటా ట్రాఫిక్‌లో 60 శాతం వాటా జియోదే'

మెగా వేళ ఆకాశ్ అంబానీ

దేశ వైర్‌లెస్ డేటా ట్రాఫిక్‌లో జియో వాటా 60 శాతానికి పైగా కలిగి ఉందని ఆకాశ్ అంబానీ తెలిపారు

చైనా తర్వాత అతిపెద్ద 5జి బేస్ భారత్‌దే అని చెప్పారు



దేశ వైర్‌లెస్ డేటా ట్రాఫిక్‌లో జియో వాటా 60 శాతానికి పైగా కలిగి ఉందని జియో ప్లాట్‌ఫారమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ తెలిపారు. చైనా తర్వాత అతిపెద్ద 5జి బేస్ భారత్‌దే అని చెప్పారు. జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ఐపీఓ ప్రారంభం కానున్న వేళ కంపెనీ భవిష్యత్ ప్రణాళికలను ఆయన వివరించారు. 2031 ఆర్థిక సంవత్సరం నాటికి భారత్‌లో 1.4 ట్రిలియన్ డాలర్ల డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఏర్పడుతుందని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. తాము అందులో భారీ మార్కెట్ వాటాను తీసుకుంటామని స్పష్టం చేశారు.2016లో జియో టెలికాం మార్కెట్లోకి ప్రవేశించిన సమయంలో సగటు డౌన్‌లోడ్ వేగం కేవలం 2.5 వీఎజూం ఉండగా, ప్రస్తుతం అది దాదాపు 68 వీఎజూంకి పెరిగిందని ఆకాశ్ అంబానీ పేర్కొన్నారు. జియో 5జి సగటు డౌన్‌లోడ్ వేగం 198.9 వీఎజూంగా ఉందని, ఇది పోటీదారుల కంటే రెట్టింపు అని తెలిపారు. 6జి నెట్‌వర్క్‌ను 2030 దశాబ్దంలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆకాశ్ అంబానీ స్పష్టం చేశారు. ప్రస్తుతం టెలికాం పరిశ్రమలో సగటున 1 డేటా ధర రూ.7.5 గా ఉంటే, జియో మాత్రం కేవలం రూ.4.9 కే అందిస్తోందని ఆయన చెప్పారు. అదే సమయంలో జియో కస్టమర్లు సగటున నెలకు 43.7 డేటాను ఉపయోగిస్తున్నారని తెలిపారు.జియోకు 2026 జూన్ 30 నాటికి 53.3 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారని ఆకాశ్ అంబానీ పేర్కొన్నారు. అందులో 28.5 కోట్ల మంది 5జీ యూజర్లేనని చెప్పారు. అయితే, చైనా తర్వాత ఈ స్థాయిలో కస్టమర్ బేస్ కలిగిన అతిపెద్ద కంపెనీ జియోనేనని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి నెలవారీ సగటు డేటా వినియోగం 43.7జీబీకి చేరిందని, జియోకు ప్రస్తుతం 3,60,537 టవర్లు ఉన్నాయని చెప్పారు. అలాగే, 26,800 వీఎఓ స్పెక్ట్రమ్ కలిగి ఉందని పేర్కొన్నారు. 2025-26 నాటికి 2.8 కోట్ల హోమ్ బ్రాండ్ కస్టమర్లను జియో కలిగి ఉందని వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.76,225 కోట్లుగా ఉందని పేర్కొన్నారు. 2024-26 ఆర్థిక సంవత్సరాల మధ్య 17.8 శాతం వార్షిక వృద్ధి రేటు నమోదైందని చెప్పారు.జియో ప్లాట్‌ఫామ్ అనేది కేవలం మొబైల్ క్యారియర్ మాత్రమే కాదని ఆకాశ్ అంబానీ పేర్కొన్నారు. సొంతంగా అభివృద్ధి చేసిన నెట్‌వర్క్ సాఫ్ట్‌వేర్, ఎక్విప్‌మెంట్‌ను సైతం ఇతర దేశాల ఆపరేటర్లకు విక్రయిస్తామని స్పష్టం చేశారు. వినియోగదారులకు తక్కువ ధరకే మొబైల్ డేటాను అందించడం వల్ల ఆన్‌లైన్ వినియోగం పెరిగిందని తెలిపారు. అలాగే, డిజిటల్ పేమెంట్స్ ఇతర ఇంటర్నెట్ సర్వీసులు కూడా వేగం పుంజుకున్నాయని చెప్పారు. రానున్న రోజుల్లో భారత్‌ను అతిపెద్ద డిజిటల్ సొసైటీగా మార్చడమే జియో లక్ష్యమని తెలిపారు.కాగా, రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్, టెలికాం విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫర్ ఈనెల 21న ప్రారంభమై, 23న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ ఈ నెల 19న జరగనుంది. ఐపీఓలో భాగంగా ఒక్కోటి రూ.10 ముఖ విలువ కలిగిన 27 కోట్ల వరకు తాజా షేర్లను జియో జారీ చేయనుంది. ఈ ఐపీఓ ద్వారా దాదాపు రూ.30,213 కోట్లను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది భారతదేశంలోనే అతిపెద్ద ఐపీఓగా నిలవనుంది. ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీస్ వద్ద జియో ప్లాట్‌ఫారమ్స్‌లో 66.43 శాతం వాటా ఉంది.

వ్యాపారులకు ఊరట- యూపీఐ లావాదేవీలపై కొత్త ఛార్జీల అమలు వాయిదా

దీపావళి తర్వాతే వీణ= వసూల్!

రూ.2వేలు దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఛార్జీల అమలును వాయిదా వేసినట్లు ఎన్‌పీసీఐ వెల్లడించింది

దీపావళి తర్వాత ఈ కొత్త ఛార్జీలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది



యూపీఐ వినియోగదారులకు గుడ్ న్యూస్. రూ.2వేలు పైబడిన యూపీఐ చెల్లింపులపై విధించాలనుకున్న 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) అమలును వాయిదా వేస్తున్నట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రకటించింది. దీని అమలుకు సంబంధించిన కొత్త తేదీని దీపావళి తర్వాత నిర్ణయిస్తామని ఎన్‌పీసీఐ మంగళవారం ప్రకటించింది. పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ అక్టోబర్ 13న జరిగిన 'యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ' సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.వాస్తవానికి ఈ కొత్త యూపీఐ ఎండీఆర్ విధానం అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం దసరా, దీపావళి పండుగల సీజన్ కావడంతో మార్కెట్లో భారీ స్థాయిలో కొనుగోళ్లు జరుగుతుంటాయి. ఈ సమయంలో అదనపు ఛార్జీలు విధిస్తే వ్యాపారులపై భారం పడడంతోపాటు, వినియోగదారుల సెంటిమెంట్‌పైనా ప్రభావం పడుతుందని వ్యాపార సంఘాలు, ఫిన్‌టెక్, పేమెంట్ కంపెనీలు ఎన్‌పీసీఐకు విజ్ఞప్తి చేశాయి. ఈ నేపథ్యంలోనే వ్యాపారులకు ఊరట కలిగిస్తూ, దీపావళి ముగిసే వరకు ఈ ఎండీఆర్ ఛార్జీల అమలును వాయిదా వేస్తూ ఎన్‌పీసీఐ నిర్ణయం తీసుకుంది.వాస్తవానికి సాధారణ వినియోగదారులకు యూపీఐ లావాదేవీలు పూర్తిగా ఉచితం. వీరిపై ఎలాంటి ఎండీఆర్ ఛార్జీలు పడవు. సింపుల్‌గా చెప్పాలంటే, మీకు మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు మధ్య జరిగే యూపీఐ లావాదేవీల(ూ2ూ)పై ఎలాంటి ఛార్జీలు ఉండవు. అవి కేవలం వ్యాపారులకు (పర్సన్ టు మర్చెంట్- ూ2వీ) మాత్రమే వర్తిస్తుంది. ఇక్కడ గుర్తించుకోవాల్సిన అంశం ఏమిటంటే, వ్యాపారులు ఈ ఛార్జీలను కస్టమర్ల నుంచి వసూలు చేయకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది.రూ.2వేల లోపు యూపీఐ లావాదేవీలు జరిగితే, ఎలాంటి ఎండీఆర్ ఛార్జీలు విధించరు. అంటే ఇది పూర్తిగా ఉచితం. ఒకవేళ ఈ యూపీఐ లావాదేవీల విలువ రూ.2వేలు దాటితే, 0.4 శాతం ఎండీఆర్ విధిస్తారు. సింపుల్‌గా చెప్పాలంటే రూ.2వేలకు 0.4 శాతం ఎండీఆర్ అంటే రూ.8 కట్టాల్సి వస్తుంది. ఒక వేళ రూ.75వేలు లేదా అంతకంటే ఎక్కువ విలువైన యూపీఐ లావాదేవీలు జరిగితే గరిష్ఠంగా రూ.300 మాత్రమే ఛార్జీగా వసూలు చేస్తారు. ఇక్కడ చిన్నవ్యాపారులకు ఊరట కలిగించే అంశం ఒకటుంది. అదేమంటే నెలకు రూ.1 లక్షలోపు యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా పేమెంట్లు పొందే చిన్న వ్యాపారులకు (ూ2ూవీ) ఎలాంటి ఎండీఆర్ ఛార్జీలు ఉండవు.వ్యవసాయ ఉత్పత్తులు, బీమా, టెలికాం సేవలు, రైల్వేలు, ఇంధనం (పెట్రోల్/డీజిల్) వంటి కొన్ని నిత్యావసర, ప్రభుత్వ సేవల రంగాల్లో రూ.2వేలు దాటిన లావాదేవీలపై 0.4 శాతానికి బదులుగా కేవలం రూ.5 ఫ్లాట్ ఫీజు మాత్రమే విధిస్తారు. అలాగే మ్యూచువల్ ఫండ్స్, సెక్యూరిటీలకు సంబంధించిన చెల్లింపులు, స్టాక్ బ్రోకర్లు, డీలర్ల ద్వారా జరిగే లావాదేవీలకు 0.02 శాతం ఎండీఆర్ ఉంటుంది. వీటికి కూడా గరిష్ఠ పరిమితి రూ.300గానే ఉంటుంది.యూపీఐ లావాదేవీలపై కొత్తగా తీసుకువచ్చిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానం వల్ల లావాదేవీల పరిమాణంపై పెద్దగా ప్రభావం పడకపోవచ్చని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సీఈఓ దిలీప్ ఆస్బే అన్నారు. యూపీఐ లావాదేవీల మొత్తం విలువలో కేవలం 10 శాతం మాత్రమే ఎండీఆర్ ఛార్జీలు పడే అవకాశం ఉందన్నారు. ఈ కొత్త విధానం ద్వారా వచ్చే రాబడి, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో మరింత పెట్టుబడికి తోడ్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సౌండ్‌బాక్స్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాల వంటి సాంకేతికతలతో తిరిగి చెల్లింపుల వ్యవస్థలోనే పెట్టుబడులు వస్తాయని ఆయన పేర్కొన్నారు.

మళ్లీ భగ్గుమన్న ముడి చమురు ధరలు

బ్యారెల్ 110 డాలర్లకు బ్రెంట్ క్రూడ్!

మే తర్వాత తొలిసారిగా 110 డాలర్ల స్థాయి

ఒక్కరోజులో 3.56 శాతం పెరిగిన ధర

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో సరఫరాపై ఆందోళనలు

రష్యా చమురు శుద్ధి కేంద్రంపై దాడితో సరఫరా ముప్పు

రష్యా డీజిల్ కొనుగోలు ఒప్పందాన్ని అడ్డుకునేందుకు అమెరికాలో బిల్లు



అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ పెరిగాయి. సరఫరా సమస్యలు త్వరలో తీరుతాయన్న ఆశలు సన్నగిల్లడంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 110 డాలర్లకు చేరువైంది. మే నెల తర్వాత ఈ స్థాయిని తాకడం ఇదే తొలిసారి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, రష్యా-ఉక్రెయిన్ మధ్య దాడులు చమురు సరఫరాపై ఆందోళనలను పెంచుతున్నాయి.బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 109.69 డాలర్లకు చేరింది. గత ముగింపుతో పోలిస్తే ఇది 3.56 శాతం అధికం. అంతర్జాతీయంగా సరఫరా పరిస్థితులు బలహీనంగా ఉండటంతో ధరలు మరింత పెరుగుతాయన్న అంచనాలతో ట్రేడర్లు కొనుగోళ్లపై ఆసక్తి చూపుతున్నారు.సౌదీ అరేబియాపై ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారుల క్షిపణి, డ్రోన్ దాడులు కొనసాగుతున్నాయి. మరోవైపు రష్యా, ఉక్రెయిన్ పరస్పరం ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు చేసుకుంటున్నాయి. రష్యాలోని ర్యాజాన్ చమురు శుద్ధి కర్మాగారంపై దాడి జరిగినట్లు వచ్చిన వార్తలతో అక్కడ కార్యకలాపాలు నిలిచిపోయినట్లు సమాచారం. ఈ పరిణామాలు చమురు సరఫరాపై ఒత్తిడిని పెంచుతున్నాయి.రష్యా నిల్వల నుంచి వందల మిలియన్ల బ్యారెళ్ల డీజిల్ కొనుగోలుకు ప్రతిపాదించిన ఒప్పందాన్ని అడ్డుకునేందుకు అమెరికా చట్టసభ సభ్యులు శుక్రవారం బిల్లును ప్రవేశపెట్టారు. ఈ ఒప్పందం రష్యా యుద్ధానికి ఆర్థికంగా తోడ్పడుతుందన్న ఆందోళనను వారు వ్యక్తం చేశారు. మరోవైపు, నవంబర్ 3 ఎన్నికల తర్వాత ఇరాన్‌పై 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్' వినియోగించే అవకాశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తోసిపుచ్చలేదని న్యూస్‌మాక్స్ కథనం పేర్కొంది.2026 డిసెంబరులో బ్రెంట్ క్రూడ్ ధర 90 డాలర్లకు చేరవచ్చని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. గతంలో వేసిన 85 డాలర్ల అంచనాను పెంచింది. పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి చివర్లో బ్రెంట్ ధర సుమారు 70 డాలర్లుగా ఉంది. హర్మూజ్ జలసంధిలో రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో అది 125 డాలర్లకు పైగా ఎగసింది. ఆ తర్వాత తగ్గిన ధరలు ఇప్పుడు మళ్లీ 110 డాలర్ల స్థాయికి చేరువయ్యాయి.

ఈ స్కూటర్లు భలే వెరైటీ.. భారత్‌లోకి ఇటలీ బ్రాండ్ 'ఇటాల్‌జెట్'!

భారత మార్కెట్లోకి ప్రవేశిస్తున్న ఇటాలియన్ ప్రీమియం స్కూటర్ల బ్రాండ్ ఇటాల్‌జెట్

కొల్హాపూర్‌కు చెందిన మోటోహాస్ ఇండియాతో భాగస్వామ్యం

విభిన్నమైన డిజైన్, అధిక పనితీరు కలిగిన డ్రాగ్‌స్టర్ సిరీస్‌కు ప్రసిద్ధి



భారత ద్విచక్ర వాహన మార్కెట్లోకి మరో ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ ప్రవేశిస్తోంది. ఇటలీకి చెందిన ప్రీమియం స్కూటర్ల తయారీ సంస్థ ఇటాల్‌జెట్ త్వరలో భారత్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఇందుకుగానూ కొల్హాపూర్‌కు చెందిన మోటోహాస్ ఇండియా సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు ప్రకటించింది. ఇప్పటికే మోటోహాస్ ఇండియా.. బ్రిక్స్‌టన్ మోటార్‌సైకిళ్లు, విఎల్ఎఫ్ (వెలొసిఫెరో) స్కూటర్లను దేశంలో పంపిణీ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇటాల్‌జెట్ రాకతో ప్రీమియం స్కూటర్ల విభాగంలో పోటీ మరింత పెరగనుంది.ఇటలీలోని బోలోగ్నా కేంద్రంగా పనిచేసే ఇటాల్‌జెట్, తన అసాధారణమైన డిజైన్లు, అధిక పనితీరు గల స్కూటర్లకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా ఈ సంస్థ అందిస్తున్న "డ్రాగ్‌స్టర్" (ణతీఖ్ఖస్త్రర్‌వతీ) సిరీస్ స్కూటర్లు తమ ర్యాడికల్ లుక్‌తో వాహన ప్రియులను ఆకర్షిస్తున్నాయి. భారత్‌లో ఏయే మోడళ్లను విడుదల చేయనున్నారు, వాటి ధరలు, లాంచ్ వివరాలను వచ్చే నెల మిలాన్‌లో జరిగే జు×జహీూ 2026 మోటార్ షోలో అధికారికంగా వెల్లడించనున్నారు.ఇటల్‌జెట్ లైనప్‌లో డ్రాగ్‌స్టర్ 125 నుంచి 700 సీసీ వరకు స్కూటర్లు ఉన్నాయి. వీటిలో అత్యంత శక్తివంతమైన డ్రాగ్‌స్టర్ 700 మోడల్, 698 లిక్విడ్-కూల్డ్ ట్విన్-సిలిండర్ ఇంజిన్‌తో వస్తుంది. ఇది 69 ష్టజూ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. దీనికి 6-స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ జతచేయడం ఒక ప్రత్యేకత. అయితే, భారత మార్కెట్లోకి డ్రాగ్‌స్టర్ 125, డ్రాగ్‌స్టర్ 300 మోడళ్లను తీసుకొచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ స్కూటర్లు అండర్‌బోన్ ఛాసిస్, ప్రత్యేకమైన ఫ్రంట్ సస్పెన్షన్, బ్రాండ్ పేటెంట్ పొందిన ఇండిపెండెంట్ స్టీరింగ్ సిస్టమ్ (×ూూ), బయటకు కనిపించే ట్రెల్లిస్ ఫ్రేమ్ వంటి విశిష్టమైన ఫీచర్లతో వస్తాయి. ఇటాల్‌జెట్ రాకతో భారత వినియోగదారులకు ప్రీమియం స్కూటర్ల విభాగంలో ఒక కొత్త, విభిన్నమైన ఎంపిక అందుబాటులోకి రానుంది.

స్టాక్ మార్కెట్లకు ఐటీ బూస్ట్.. లాభాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో సెషన్‌లోనూ లాభాల జోరు కొనసాగించాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గడం, ముఖ్యంగా ఐటీ రంగ షేర్లలో బలమైన కొనుగోళ్లు జరగడం సూచీల పెరుగుదలకు దోహదపడింది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 413.70 పాయింట్లు (0.56%) లాభపడి 74,729.27 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 148.80 పాయింట్లు (0.65%) పెరిగి 23,146.15 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 23,100 కీలక మార్క్‌ను దాటింది.ఈ ర్యాలీకి ప్రధానంగా ఐటీ షేర్లు నాయకత్వం వహించాయి. టెక్ మహీంద్రా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఃజూ), ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్లుగా నిలిచి మార్కెట్‌కు ఊతమిచ్చాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ అత్యధికంగా లాభపడగా, నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ అమ్మకాల ఒత్తిడితో నష్టాలను చవిచూసింది.అయితే, ప్రధాన సూచీలు లాభపడినప్పటికీ బ్రాడర్ మార్కెట్‌లో మాత్రం మిశ్రమ ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.11%, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.01% మేర స్వల్పంగా నష్టపోయాయి. ఇది మార్కెట్ ర్యాలీ కొన్ని ఎంపిక చేసిన రంగాలకే పరిమితమైందని సూచిస్తోంది.మార్కెట్ విశ్లేషకుల ప్రకారం, తగ్గుతున్న ముడిచమురు ధరలు ద్రవ్యోల్బణంపై ఆందోళనలను తగ్గించాయి. ఇది పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను బలపరిచింది. టెక్నికల్‌గా, నిఫ్టీ 23,000 మార్క్ పైన నిలదొక్కుకోవడం సానుకూల సంకేతమని నిపుణులు చెబుతున్నారు. ఈ స్థాయి పైన కొనసాగితే, నిఫ్టీ 23,500-23,600 జోన్‌కు వెళ్లే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తక్షణ మద్దతు 22,800 వద్ద, నిరోధం 23,200 వద్ద ఉన్నాయని తెలిపారు. మార్కెట్లలో రికవరీ నిలకడగా కొనసాగాలంటే కేవలం ఐటీ రంగమే కాకుండా, ఇతర రంగాల్లోనూ వృద్ధి అవసరమని అభిప్రాయపడుతున్నారు.



విజయ్ దేవరకొండ బాక్సాఫీస్ పూనకం!

'రణబాలి' మూవీ రివ్యూ

చరిత్ర పుటల్లో మరుగునపడిపోయిన వీరుల కథలను వెండితెరపైకి తీసుకొచ్చి, వారి పోరాటాలను నేటి తరానికి పరిచయం చేయడం గొప్ప ప్రయత్నం. ముఖ్యంగా బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఆకలి బాధలు, కరువు కాటకాలు, దోపిడీ, అలుచివేత వంటి అంశాలను భావోద్వేగాలతో మేళవించి చెప్పడం అంత సులభం కాదు. అలాంటి ఒక మరుగునపడిపోయిన వీరుడి జీవితాన్ని, పోరాటాన్ని తెరపై ఆవిష్కరించిన చిత్రమే 'రణబాలి'. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన ఈ చిత్రానికి 'టాక్సీవాలా' ఫేమ్ రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహించారు. బలమైన చారిత్రక నేపథ్యం, మానవీయ భావోద్వేగాలు, తిరుగుబాటు స్ఫూర్తి కలగలిసిన ఈ సినిమా ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందించింది? భారీ అంచనాలతో వచ్చిన ఈ సినిమా అంచనాలని అందుకుందా? రివ్యూలో మాద్దాం.

కథ

బ్రిటిష్ పాలనలో మద్రాస్ ప్రాంతం తీవ్రమైన కరువును చూసిన కాలమది. రాయలసీమ ప్రాంతంలోని సింగనమల ప్రాంతానికి రక్షణగా ఉంటాడు భద్రమల్లన్న స్వామి. ఆ స్వామి ఆశీస్సులతో జన్మిస్తాడు రణబాలి (విజయ్ దేవరకొండ). తన పుట్టుకకు ఓ కారణం ఉంటుంది. తన ప్రజలను కరువు రాక్షసుడి నుంచి కాపాడటం తన కర్తవ్యం. బ్రిటిష్ జనరల్ ఆర్నాల్డ్ వోస్లూ రూపంలో వస్తాడు ఆ కరువు రాక్షసుడు. దేశంలో లేని కరువును సృష్టిస్తాడు. అన్నపూర్ణ అయిన ఈ దేశాన్ని ఆకలి చావులతో అలమటించేలా చేసి, ఇక్కడ పండిన ధాన్యపు రాశులను ఇంగ్లాండ్‌కు రహణా చేసే మన్నాగం మన్నుతాడు. ఆ బ్రిటిష్ ఆకృత్యాల నుంచి రణబాలి తన ప్రజలను ఎలా రక్షించుకున్నాడు? ప్రజల ఆకలి తీర్చడానికి ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ.

విశ్లేషణ

చరిత్రలో మరుగునపడిపోయిన ఓ వీరుడి కథ ఇది. ఒక వ్యక్తి పోరాటం వెనుక ఉన్న ప్రజల బాధలను, ఆ కాలపు సామాజిక పరిస్థితులను ఆవిష్కరించడంతో పాటు, కథలో భాగంగా భద్రమల్లన్న జానపద గాథను దర్శకుడు మేళవించిన తీరు ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంటుంది. 'రణబాలి'లో ప్రధానంగా ఆకట్టుకునేది కథాంశం. దాని వెనుక ఉన్న మానవీయ కోణం. బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న దారుణమైన పరిస్థితులను దర్శకుడు కొన్ని సన్నివేశాల్లో హృదయానికి హత్తుకునేలా చూపించారు. కరువు కారణంగా ఆకలితో అలమటించే ప్రజలు, తమ కుటుంబాలను కాపాడుకోవడానికి వారు పడే తపన, జీవనం కోసం చేసే పోరాటం ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తాయి. తెరపై కనిపించే సన్నివేశాలు, ప్రజల కన్నీళ్లు, వారి దుర్భర జీవితాలను ప్రతిబింబించే సన్నివేశాలు కథకు వాస్తవికతను తీసుకొస్తాయి. చరిత్రలోని ఒక చీకటి అధ్యాయాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం ఈ చిత్రానికి ప్రత్యేకతను తీసుకొస్తుంది. రణబాలి పుట్టుక, భద్రమల్లన్న నేపథ్యం, ఊర్లో జాతర, అక్కడ రణబాలిపై జరిగిన దాడి, తొలి యాక్షన్ ఘట్టం.. ఇవన్నీ ప్రేక్షకుడిని కథలో లీనం చేస్తాయి. జయమ్మ పాత్రలో రష్మిక పరిచయం, పెళ్లి తర్వాత వచ్చే సన్నివేశాలు హత్తుకునేలా ఉంటాయి. ఇంటర్వెల్ సీక్వెన్స్ సినిమాకు మేజర్ హైలైట్‌గా నిలుస్తుంది. ఇంటర్వెల్ తర్వాత కూడా కథ మరింత తీవ్రతతో సాగుతుంది. బ్రిటిష్ వాళ్లు స్వాధీనం చేసుకున్న ఆహారాన్ని రణబాలి తిరిగి తీసుకొచ్చి ప్రజలకు అందించే ఎపిసోడ్‌లో అతని పోరాట స్ఫూర్తి మరో స్థాయిలో నిలుస్తుంది. ప్రీ క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషనల్ సీన్స్ కదిలిస్తాయి. ఈ సన్నివేశాలు కథలోని మానవీయ భావోద్వేగాలను మరింత అందంగా ఆవిష్కరిస్తాయి. ఒక చివర్లో భద్రమల్లన్న స్వామి పాత్రను ఉపయోగించుకున్న తీరు థియేటర్లలో పూనకం తెప్పిస్తుంది.

నటీనటుల నటన

రణబాలి పాత్ర విజయ్ దేవరకొండ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. నటుడిగా తనను మరో స్థాయిలో నిలబెట్టిన ప్రదర్శన కనబరిచారు. పాత్రలోని తీవ్రత, ఆవేశం, పోరాట స్ఫూర్తిని తెరపై అద్భుతంగా ఆవిష్కరించారు. యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగ సందర్భాల్లోనూ పాత్రకు పూర్తి న్యాయం చేశారు. రష్మిక జయమ్మ పాత్రలో సహజంగా కనిపిస్తూ మెప్పించారు. విజయ్ దేవరకొండతో ఆమెకు సంబంధించిన సన్నివేశాలు అందంగా, హత్తుకునే భావోద్వేగాలతో సాగుతాయి. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు మంచి ఆకర్షణగా నిలుస్తుంది. రుత్వరి రావు పాత్ర కథకు మరింత బలాన్ని తెచ్చింది. బ్రిటిష్ జనరల్ ఆర్నాల్డ్ వోస్లూ పాత్రలో కావాల్సిన క్రూరత్వం కనిపించింది. కథలోని సామాజిక, చారిత్రక నేపథ్యానికి అనుగుణంగా మిగతా పాత్రలు కూడా తమ వంతు సహకారం అందించాయి.

టెక్నికల్ విభాగం

చరిత్రలో మరుగునపడిపోయిన ఒక వీరుడి కథను ఎంచుకోవడం, దాని వెనుక ఉన్న సామాజిక పరిస్థితులను తెరపైకి తీసుకురావడంలో రాహుల్ సాంకృత్యన్ అద్భుతమైన పనితీరు కనబరిచారు. ప్రజల బాధలు, తిరుగుబాటు స్ఫూర్తి, జానపద గాథ వంటి భిన్నమైన అంశాలను ఒకే కథలో చక్కగా మేళవించారు. కొన్ని భావోద్వేగ సన్నివేశాలను హృద్యంగా తెరకెక్కించడం ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనం. బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులను సంభాషణలు, సంఘటనల ద్వారా వాస్తవానికి దగ్గరగా తీయడం అభినందనీయం. చారిత్రక నేపథ్యానికి తగిన నిర్మాణ విలువలతో సినిమాను గ్రాండ్‌గా నిర్మించారు. కెమెరా వర్క్ కూడా టాప్ క్వాలిటీతో ఉంది. ఎడిటింగ్ ఇంకాస్త పదునుగా ఉండొచ్చు. అలాగే, అజయ్--అనుల్ కొన్ని చోట్ల మరింత బలంగా నేపథ్య సంగీతాన్ని ఇచ్చే అవకాశాన్ని చేజార్చుకున్నారనిపించింది.

ప్లస్ పాయింట్స్
బలమైన చారిత్రక కథాంశం
విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ నటన
విజయ్ దేవరకొండ--రష్మిక మందన్న సన్నివేశాలు
ఇంటర్వెల్ సీక్వెన్స్, క్లైమాక్స్
భావోద్వేగ ఘట్టాలు
భద్రమల్లన్న జానపద గాథ
మైనస్ పాయింట్స్
ఆశ్చర్యకరా నెమ్మదైన కథనం
నేపథ్య సంగీతం

ఫైనల్‌గా: చరిత్రలో జరిగిన సంఘటనలను కమర్షియల్ హిస్టారికల్ ఫిక్షన్‌గా మలిచిన తీరు ఆద్యంతం ప్రేక్షకుడిని కట్టిపడేస్తుంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న, రాహుల్ సాంకృత్యన్ కెరీర్లలో ఈ చిత్రం గుర్తుండిపోయే స్థానాన్ని సంపాదించుకుంటుంది. బాక్సాఫీస్ పద్ద కాసుల వర్షం కురిపించే అవకాశం పుష్కలంగా ఉంది.

రేటింగ్: 3.5/ 5

రా అండ్ రస్టిక్ యాక్షన్ లవ్ స్టోరీతో రానున్న 'డానీ'.. నవంబర్ 13న గ్రాండ్ రిలీజ్!



టాలీవుడ్‌లో నైవిధ్యమైన కథాంశాలతో ప్రేక్షకులను అలరిస్తున్న యువ హీరో ఆశిష్ గాంధీ, టాలెంటెడ్ డైరెక్టర్ కళ్యాణ్‌జీ గోగణ కాంబినేషన్‌లో వస్తోన్న మోస్ట్ అంటెసిపేటెడ్ మూవీ 'డానీ'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'నాటకం' సినిమా ఎలాంటి సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పుడు అదే జోరుతో అంతకుమించిన ఇంటెన్సివ్ కంటెంట్‌తో ఈ కొత్త సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. రజ్వాన్ ఎంటర్టైన్మెంట్, కళ్యాణ్‌జీ కంటెంట్ పిక్చర్స్ పతాకాలపై ప్రముఖ నిర్మాత రజ్వాన్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్, క్రైమ్, రా అండ్ రస్టిక్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంపై ట్రేడ్ సర్కిల్స్‌లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ స్ట్రైక్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. సినిమాలోని బోల్డ్ కంటెంట్, రా అండ్ రస్టిక్ మేకింగ్ స్టైల్ యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సాధారణ ప్రేమ కథలకు భిన్నంగా, మనిషి జీవితంలో ఉండే అలవాట్లకు, అతను మనసారా కోరుకునే ప్రేమకు మధ్య జరిగే భావోద్వేగ సంఘర్షణే ఈ చిత్రానికి ప్రధాన హైలైట్ కానుంది. ఓ వ్యక్తి తన జీవితంలో అలవాటు చేసుకున్న పద్ధతులు అతని గమ్యభావితాన్ని ఎలా మార్చాయి? ఆ వ్యక్తి నిజమైన ప్రేమలో పడిన తర్వాత తన జీవితంలో ఎలాంటి మెసుమార్పులు వచ్చాయి? ఈ రెండు విభిన్నమైన ధోరణుల మధ్య సలిగిపోయే పాత్రల ప్రయాణం ఎలా సాగిందనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సినిమాను అత్యంత సహజంగా తెరకెక్కించారు. ఈ చిత్రంలో ఆశిష్ గాంధీ సరసన సేజల్ గుప్తా హీరోయిన్‌గా నటిస్తుండగా, సోనాల్ సింగ్, ఆజర్ ఖాన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మేకర్స్ తాజాగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేసింది. హీరో హీరోయిన్ల డిఫరెంట్ లుక్స్, పోస్టర్ డిజైన్ తీరు సినిమా నేపథ్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపుతున్నాయి. ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ సాయి కార్తీక్ అందిస్తున్న బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుందని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఏకే ఆనంద్ సినిమాటోగ్రఫీ, మణికాంత్ ఎడిటింగ్ బాధ్యతలు అద్భుతంగా నిర్వర్తించారు. కొల్లి గోపాల కృష్ణ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రానికి ఖుషి, సుధాకర్ గోడ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. భార్గవ తోట ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, రామ్ సుంకర మరియు కళ్యాణ్‌జీ గోగణ యాక్షన్ కొరియాగ్రఫీ అందించగా, సాయిరామ్ జల్లా కో-డైరెక్టర్‌గా సేవలందించారు. రిథమ్ స్టూడియోస్ సౌండ్ డిజైన్ చేయగా, కోటి వర్క్స్ పబ్లిసిటీ డిజైన్స్ అందించారు. సాయి సతీష్ పీఆర్వోగా వ్యవహరిస్తున్నారు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ రా అండ్ రస్టిక్ రొమాంటిక్ క్రైమ్ డ్రామా 'డానీ' సినిమాను ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 13న ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



విజువల్ వండర్‌గా 'రామాయణం' కొత్త ట్రైలర్.. శ్రీరాముడిగా రణ్‌బీర్, రావణాసురుడిగా యశ్ అదుర్స్!



ఇండియన్ సినిమా చరిత్రలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న మైథలాజికల్ ప్రాజెక్ట్ 'రామాయణం: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' నుంచి మేకర్స్ కొత్త ట్రైలర్‌ను విడుదల చేశారు. హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ సరికొత్త ట్రైలర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. 'దంగల్' వంటి ఇండస్ట్రీ హిట్ సినిమాలను అందించిన ప్రముఖ దర్శకుడు నితేష్ తివారీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ రెండో ట్రైలర్ సినిమాపై అంచనాలను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లింది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా కనిపించనుండగా, టాలీవుడ్ సెన్సేషన్ సాయి పల్లవి సీతాదేవి పాత్రలో అమాయకత్వంతో మెప్పించనున్నారు. ఇక రాకింగ్ స్టార్ యశ్ పవర్‌ఫుల్ రావణాసురుడి పాత్రలో భీకరంగా కనిపిస్తున్నాడు. ఇక ఈ చిత్రం మొదటి భాగం నవంబర్ 5, 2026న ప్రపంచవ్యాప్తంగా అట్టహాసంగా థియేటర్లలో విడుదల కానుంది. బమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ విడుదలవుతున్న ఈ చిత్రం ఇండియన్ సినిమా స్థాయిని గ్లోబల్ స్థాయిలో నిలబెడుతుందని తాజా ట్రైలర్ స్పష్టం చేస్తోంది.

'కుంభ'లోని శక్తిని ఇప్పుడే తట్టిలేపాలని అనుకోవడం లేదు.. పృథ్వీరాజ్ బర్త్‌డేపై రాజమౌళి ట్వీట్

టాలీవుడ్ అగ్ర దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'వారణాసి' సూపర్‌స్టార్ మహేష్ బాబు హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ఒక శక్తివంతమైన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. కాగా, తాజాగా పృథ్వీరాజ్ సుకుమారన్ పుట్టినరోజు సందర్భంగా రాజమౌళి ఆయనకు సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పృథ్వీరాజ్ బర్త్‌డే సందర్భంగా రాజమౌళి చేసిన ట్వీట్ ప్రస్తుతం సినీ వర్గాల్లో, అభిమానులలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. "హ్యాపీ బర్త్‌డే పృథ్వీ. ఈరోజు నీలోని 'కుంభ'ను తట్టిలేపాలని నేను అనుకోవడం లేదు. ప్రపంచంపై తనదైన ముద్ర వేయడానికి తలరాతతో ముడిపడి ఉన్న కుంభ అతడు" అంటూ రాజమౌళి రాసుకొచ్చారు. 'కుంభ' అనేది 'వారణాసి' చిత్రంలో పృథ్వీరాజ్ పోషిస్తున్న పాత్ర పేరు కావడం విశేషం. ఈ చిత్రంలో మహేష్ బాబు సరసన ప్రియాంక చోప్రా జోనాస్ నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్ రోల్ సినిమాకే హైలైట్‌గా నిలవనుందని సమాచారం.

వెంకీ, త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' మరోసారి వాయిదా.?



టాలీవుడ్ ప్రేక్షకులతో పాటు విక్టరీ వెంకటేశ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్ సినిమా మరోసారి వాయిదా పడిన సంగతి తెలిసిందే. విక్టరీ వెంకటేశ్ కథానాయకుడిగా, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్ 47). ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, గతంలో పలుమార్లు విడుదల తేదీ మారిన ఈ చిత్రం, తాజాగా అక్టోబర్ 9న థియేటర్లలోకి రావాల్సి ఉండగా.. మరోసారి వాయిదా పడటం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. సినిమా చివరి దశలో సాంకేతిక పనులు అనుకున్న సమయానికి పూర్తికాకపోవడంతోనే విడుదలను వాయిదా వేయాల్సి వచ్చిందని నిర్మాత నాగవంశీ వెల్లడించారు.

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.